ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
13 ఫిబ్రవరి, 2011

ENTERED

అరబ్బుల ప్రజాస్వామ్య దాహం

హ్యాపీబర్త్‌డే

(2011 ఫిబ్రవరి 13 నుంచి 2011 ఫిబ్రవరి 19 వరకు)

ఎవిలిన్
3సం॥,ఫిబ్రవరి-13
రోజామణి-శామ్యూల్‌రాజ
కర్నూలు

కె.అభినవ్
ఫిబ్రవరి-16
వాణి-శ్రీనివాసులు
ఆత్మకూరు-కర్నూలు

శ్రీనిఖిత సూర్య
1సం॥, ఫిబ్రవరి-15
సత్య-సత్యప్రసాద్
హైదరాబాద్

పార్థ్(కన్నా)
1సం॥,ఫిబ్రవరి-2010
రీనా-లింబాద్రి
మానస్‌సరోవర్-నవీముంబాయి

ఎ.మురారి
ఫిబ్రవరి
సుజాత-అనిల్
రామంతపూర్

పి.అస్మిత
7సం॥,ఫిబ్రవరి-13
విజయ-రాములు
రికాబ్‌గంజ్-హైదరాబాద్

జి.ఎం.ఎం.దీపక్
4సం॥, ఫిబ్రవరి-13
లక్ష్మీకుమారి-గిరిబాబు
ముడసర్లోవ-వైజాగ్

యషిక(శీతల్)
6సం॥,ఫిబ్రవరి-14
సుజాత-అరుణ్
జమిస్తాన్‌పూర్-హైదరాబాద్

టి.ఆర్.వరుణ్
5సం॥,ఫిబ్రవరి-17
సునీతాదేవి-రంగనాథ్‌గుప్త
వెలుగోడు-కర్నూలు

పి.వి. సురేంద్రరెడ్డి
6సం॥,ఫిబ్రవరి-13
రమణమ్మ-రామిరెడ్డి
దరిశి-ప్రకాశం

జి.దివ్యసాయి
9సం॥,ఫిబ్రవరి-14
గంగాభవాని-సూరిబాబు
ఆదర్శనగర్-ఖమ్మం

జి.కృష్ణసాయి
2సం॥, ఫిబ్రవరి-2009
లావణ్య-నటరాజ్
చైతన్యపురి-హైదరాబాద్

జె. గాయత్రి
6సం॥,ఫిబ్రవరి-2005
వీణ-రాజేష్
హెచ్.బి.కాలనీ-విశాఖ

ఎన్.చంద్రిక
1సం॥,ఫిబ్రవరి-18
క్రాంతి-శివ
మార్కాపురం-ప్రకాశం

మనలో మాట

వలపూ ఓ వ్యాపార సరకే

‘మీ ప్రియురాలి ప్రేమ పొందడానికి తనిష్క్ డైమండ్’

♥♥♥

‘ప్లాటినం ఆభరణాలతో మీ ప్రేమ పదిలం’

♥♥♥



విపణీ వీధిలో ఇలాంటి వలపు వాణిజ్య ప్రకటనలెన్నో. వాలంటైన్స్ డే వస్తోందంటే మొదట సంతోషించేది ప్రేమికులే కాదు! వ్యాపారులు కూడా!! తమ సరకును లాభసాటిగా ఎలా అమ్ముకోవాలో వారికి మాబాగా తెలుసు. మానవ ఉద్వేగాలతో ఎలా వ్యాపారం చేయాలో వారికి వెన్నతో పెట్టిన విద్య. అందుకోసం క్షణానికో కొత్త మార్గాన్ని అన్వేషిస్తారు. నిముషానికో సందర్భాన్ని ఆవిష్కరిస్తారు. బంధానికో రోజు, అనుబంధానికో తారీకు జోడిస్తారు. ప్రేమికుల రోజు కూడా అలాంటిదే. గ్రీటింగ్ కార్డులు, రోజాపూలు, చాక్లెట్లులు, బొమ్మలు, ఆభరణాల పేర ప్రేమికుల జేబులకు చిల్లులు పెట్టేస్తారు. ఏ బజారుకెళ్లినా ‘ప్రేమ మీకు, డబ్బు మాకు’ అన్నట్టు రంగం సిద్ధం చేసేస్తారు. మరి వారిది ‘వ్యాపార ప్రేమ’ కదా. వందలవేల కోట్లలో లావాదేవీలు జరిగిపోతాయి.

ఎన్నెన్ని ఆఫర్లు, ఎన్నెన్ని డిస్కౌంట్లు! ఆ ఆనందంలో, మైమరపులో పర్సు ఖాళీ అవ్వాల్సిందే. అన్ని బజార్లు ప్రేమికుల దగ్గరకే చేరుకుంటాయి.

వలపు వాణిజ్యంలో పత్రికలు, టీవీ చానళ్లు, రేడియోల పాత్ర తక్కువేం కాదు. ఏమేం బహూకరించి ప్రేమను ప్రకటించొచ్చో, పెంచుకోవచ్చో చెప్తాయి. లవేరియా లక్షణాలేంటో విపులీకరిస్తాయి. తియతియ్యటి ప్రేమ కబురులెన్నో చెప్పి ఆకట్టుకుంటాయి. ఇక షాపింగ్ మాళ్లు, రెస్టారెంట్లు, హోటళ్లు ప్రేమికుల కోసం ఎన్నెన్ని చేస్తాయి? మత్తెక్కించే మద్యం గ్లాసుల గలగలలు, మైమరపించే మ్యూజిక్కు... తళుకుబెళుకుల సెలబ్రిటీలతో చేయించే హంగామా అంతా ఇంతా కాదు. అంతా యువ కస్టమర్ల కోసమే సుమా!

హృదయాకారపు వస్తువులకు ఆరోజు చెప్పలేనంత గిరాకీ. ఉంగరాలు, బూరలు, కేకులు, పూలు, ఫొటో ఫ్రేములు, బ్యాగ్గులు, చాక్లెట్లు, ఆభరణాలు..ఏవైనా సరే గుండె గూటిని పోలివుంటే చాలు. క్షణాల్లో కొనేస్తారు. బహూకరించేస్తారు. ఇవేనా! అర్ధరాత్రి సర్‌ప్రైజ్ గిఫ్టులు, స్పెషల్ డిన్నర్లు... బిల్లు ఎంతైనా పర్లేదు!

ప్రేమ కోసం ఆ మాత్రం ఖర్చు చేయకపోతే ఎలా! షాజహాన్‌లా తాజమహల్ కట్టించలేకపోయినా ఈ చిరుబహుమతులైనా ఇవ్వకపోతే ఎలా! అన్న వాతావరణం సృష్టించేస్తారు.

మల్లెలాంటి నిష్కల్మష ప్రేమను ప్రియసఖీ సఖుల సముఖాన ఆవిష్కరించడానికి ఖరీదైన బహుమతే కావాలా!

ముహూర్తం పెట్టినట్టు ఆ రోజునే చెప్పాలా! ★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	3
తెల్సా	...	5
ఈ పేజ్	...	6
రుచి	...	7
కొత్త పుస్తకాలు	...	11
నవ్వుల్ పువ్వుల్	...	10
తెలుసుకుందామా	...	12
అట్టమీది కథ	...	14
కథ	...	18
కార్టూన్లు	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

కెరటం 4

సినిమా ... 8

మూకీల నాటి మహా నిర్మాత... నటుడు... హిమాంశురాయ్!

వికాసం.. 20

ఎందుకు నవ్వారు?



పురాణగాథలూ చెప్పాలి

ప్రతి వారం 'హ్యాపీ బర్త్‌డే' శీర్షికలో ప్రచురించే చిన్నారి నవ్వుల ముఖారవిందం ఒక బృందావనం. ఈ పేజీ మాకెంతో ఆనందాన్ని చేకూర్చుతోంది. బాలలు పరమాత్మ స్వరూపులని ఊరికే అనలేదు. మనకు తెలీని చిన్నారి పొన్నారి బాల బాలికల ముద్దు ముద్దు ముఖాలు చూడముచ్చట గొలిపి ఎంత చూస్తున్నా చూడాలనే అనిపిస్తుంది. కలర్ ఫొటోల ముద్రణ అద్భుతంగా ఉంది. నాకో సందేహం! ఏ వయసు పిల్లల వరకు ఫొటోలు పంపవచ్చు. హైస్కూల్ విద్యార్థుల ఫొటోలు పంపవచ్చా? నేటి పిల్లలకు చాలా వరకు మన పురాణ గాథలు తెలీవు. వాటిని చివరి పేజీలో పిట్ట కథలుగా ముద్రిస్తే బావుంటుంది.

పక్కి బాలకృష్ణారావు, గాజువాక.

అలరించిన మంచు దుప్పటి

ఆదివారం స్నేహలో మంచుదుప్పటి వ్యాసం అలరించింది. కాశ్మీరు లోయ అందాలు, చవులూరించే పండ్లతోటలు, పర్వత ప్రాంతాలు, పవిత్ర అమరనాథ క్షేత్రం, సరస్సులు, మంచు రాల్చే చెట్ల విశేషాలు ఆకట్టుకున్నాయి.

నూతి నారాయణరావు, గడ్డిఅన్నారం.

ఉపాధి మార్గం

'శవ సేవలు' ప్రతి వారికి అవసరం. మరణం సహజం. రాను రాను మానవీయకోణం అంతరించిపోతుంది. మరణించిన తర్వాత అనాథగా మిగిలిపోకూడదు. శ్మశానం దగ్గరికి పట్టుమని పదిమంది కూడా రావడంలేదు. మోయడానికి మనుషులు కరువవుతున్న సంఘటనలూ ఉన్నాయి. మానవ సంబంధాలు అడుగంటుతున్నాయి. అందుకే ఫ్యూనరల్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు అవసరమే. వీటి ద్వారా కొంతమందికి ఉపాధి దొరుకుతుంది. అలాగే చనిపోయినవాళ్ల అవయవాలు శరీరదాన సంస్థల ద్వారా మెడికల్ కాలేజీలకు దానం చేస్తే మంచిది. విద్యార్థులకైనా పరిశోధనకు పనికొస్తాయి. రచ్చబండపై 'మనలోమాట' బావుంది. రచ్చబండ చాకిరేవు బండ కాకుంటే చాలన్నట్లు ఉంది నేటి పరిస్థితి.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

ఉత్సాహం... ఉపయోగం...

కాశ్మీరు లోయ సొగసులను ప్రతి భారతీయుడూ సందర్శించాలనుకుంటాడు. అలాంటి మంచు ప్రదేశాన్ని ఈ వారం మాకు పరిచయం చేసినందుకు కృతజ్ఞతలు. నెట్ విశేషాలు ఉత్సాహంగా, ఉపయోగపడేలా ఉన్నాయి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

ఆచరించదగ్గ 'వికాసం'

రచ్చబండ రాజకీయం గురించి మనలోమాటలో చక్కగా రాశారు. పాలకుల ఉత్తుత్తి మాటలు గురించి కొంత రాస్తే మరింత బాగుండేది. ఎందరో కొత్తనటులను సినీ ప్రపంచానికి పరిచయం చేసిన ఇవివి సత్యనారాయణ గురించి ఇచ్చిన వ్యాసం సందర్భానుగుణంగా ఇవ్వడం బావుంది. మొగలు చక్రవర్తులు ఉద్యానవనాలను నిర్మించి ప్రకృతి అందాలను తరతరాలకి అందజేశారు. కె.నాగలక్ష్మి 'మంచు దుప్పటి' వ్యాసంలో కాశ్మీరు అందాలను , అక్కడి వారి జీవనాన్ని చూపించినందుకు ధన్యవాదాలు. 'ఎడబాటు' కథ అనుభవంతో రాసినట్లుగా బావుంది. ఇప్పటి వరకు శవసేవలు అమెరికా, యూరప్‌లోనే ఉన్నాయి. ప్రపంచీకరణం అమల్లో ఉన్నందువల్ల అవి మనదేశానికీ రావచ్చేమో అనిపిస్తుంది. దీనికి ఉదాహరణగానే జార్జి ఫెర్నాండెజ్ అమెరికా నుండి శవపేటికలు తెప్పించారు. 'ఎప్పుడూ ఇంతేనా' అంటూ భార్యాభర్తలు ఎలా మసలుకోవాలన్నది పిపీ గారు చక్కగా వివరించారు. అది తప్పకుండా అందరూ ఆచరించదగ్గది. సంసారంలో సమానత లేకున్నా, ఇద్దరిలో ఎవరో ఒకరు అర్థం చేసుకోలేక పోయినా ఆ కాపురం గాడి తప్పుతుంది.

ఇలిపిల్ల సూర్యనారాయణ, భీమనవారిపేట, విజయవాడ.



కథ బాగుంది

'ఎడబాటు' కథ బాగుంది. చదువుకునే వయసులో కొంచెం ఓపిక పట్టి, కష్టపడితే తర్వాతి జీవితమంతా హాయిగా గడపొచ్చు. కానీ సారయ్య ఎవరో తెలియని మనిషి మాటలు నమ్మి స్నేహితునితో వెళ్లనందుకు తల్లిదండ్రులకు దూరంగా చదువు సంధ్యలు లేకుండా అడుక్కుతినాల్సి వచ్చింది. 'చూద్దామా'లో మంచు దుప్పటి కాశ్మీర్ అందాలను, జీవన శైలిని చక్కగా వర్ణించారు. కాస్త ఓర్పుతో వ్యవహరిస్తే ఎటువంటి సమస్యలైనా పరిష్కారమౌతాయని 'వికాసం'లో పిపీగారు అందరూ ఆచరించదగ్గది.

విజయ్, గుంటూరు.

★



దోపిడీ పరిశ్రమ ముర్దాబాద్



కవిత్వమ్

మతం
సమాజ శరీరమంతా పాకి
అంతరంగాలకు మత్తెక్కించి
హాలాహలమై నంజుకు తింటుంది
దుష్ట దురధికార రాజ్యం
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు
పక్షవాత రోగాన్ని ప్రసాదించి
మానవతను అష్టదిగ్బంధనం చేస్తుంది
సమాజ నాణేనికి ఇవి బొమ్మాబొరుసులు
అపూర్వ సహోదరులు
ఒక దానికి మరొకటి పూరకం
ఒకటి లేకుంటే
మరొకటి ఒడ్డున పడ్డ చేపే!
మతం మూఢత్వాన్ని పెంచి పోషిస్తుంటే
దురధికారం
ప్రజలను అధికారానికి దూరం చేస్తుంది
మతం వివేచనకు విడాకులిప్పిస్తే
దురధికారం శ్రమకు
ఆస్తి హక్కు లేకుండా చేస్తుంది
దోపిడీ పరిశ్రమకు పునాదులు వేస్తుంది
మూడు పూలు ఆరు కాయలుగా వికసింపజేస్తుంది
వీటి అస్తిత్వం అసహజం
ప్రస్తుత మతం మానవతా పూరకం కాదు
ప్రస్తుత అధికార స్వామ్యం
ప్రజాధికార సమతాస్వామ్యమూ కాదు
అధికార వ్యక్తి ప్రయోజన స్వామ్యం మాత్రమే
రాజ్యయంత్రం
మతం కందెనతో
కుల ఇంధనంతో
దోపిడీని చట్టబద్ధం చేస్తున్న పరిశ్రమ మాత్రమే!
"శ్రమ పిడికిలి" దీనికి విరుగుడు
బలం తెలిసి దీన్ని వినియోగిస్తే
"దోపిడీ పరిశ్రమ ముర్దాబాద్' అంటూ కదిలితే
శాశ్వతంగా ఈ పరిశ్రమ మూతపడుతుంది
సమతా పరిశ్రమ వికసిస్తుంది

- వల్లభాపురం జనార్థన

అన్వేషణ



ఎక్కడని వెతకను
ఉన్నావన్న ఆశతో
నిరంతరం డేగ చూపులతో
అణువణువు గాలిస్తూ...
రహదారిపై ఎర్రటి ఎండలో
ఏదో నంబరు మైలురాయిపై
ఎవరో కూర్చున్నారు...
శరీరాన్ని ముద్దలా మడిచి
గుండ్రంగా సున్నాలా కనిపిస్తున్నారు!
అర్థనిమీలిత నేత్రాలతో
ఆత్రంగా వెతుకులాట
అక్కడో, ఇక్కడో, మరెక్కడో
నిను వెతుక్కుంటున్నాను!
సుదూర తీరాన్నుంచి
నీ గద్గద స్వరం
మలయమారుతంలా తాకింది
నా మనోహర నేత్రం విచ్చుకుంది సంతోషంగా!
రెండు రక్తపు బొట్లు
నేలపై రాల్చి
పెను వృక్షమై ఎదిగినా...
నాపై వాలే పావురాళ్లు
కూడా నీ జాడ చెప్పలేదు!
కన్నీటి తెరలలో
నీ అస్పష్ట రూపం
కనులు మూసి తెరిచేలోగా
మాయమైపోతున్నది!
చిక్కటి చీకటిలో కూడ
ఎక్కడివో వెలుతురు జాడలు
మనస్సులోకి దూరి ధైర్యానిస్తున్నాయి!
కనిపించక పోవడం తాత్కాలికమే
కనుమరుగవడమే భరించలేనిది!

- ఇ. వెంకటేష్

పాట కాని పాట



శబ్దాలు మోసుకొచ్చే రాగాలు చెవుల
చేరి హృదిని పసందుగా విందు చేస్తుంటే
పరవశించి కరిగి పోని మనిషెందుకు
కష్టాల లెక్కల ఖాతాలు మూసి
వేదనా భంగిమల రూపాలు మాపి
ఉత్తుంగ తరంగాలు ఆనందం పొంగే
పాటకు బాణీలు కట్టి ఓణీలు వేసి
స్వర రాగాలతో హారాలు వేసి
శృతిలయలతో సింగారాలు చేసి
సుస్వర రూపెత్తిన గళ గలలకు
తలలు వంచి మోకరిల్లని మనసెందుకు
ఏడ్చే పాపకు ఊయల ఊపుతూ
పాడే తల్లి జోల పాటకు లయ కలపదా
మాయలు తెలియని మాలిన్యం అంటని పాప
ఆ తల్లి తీసే రాగాలకు మౌనముద్ర కాదా
తేనెల ఊటగా పాటను మలుచుకున్నా
కాసుల పంటగా మారితే విషాదమే
మేథతో మథించి అశ్లీల బూతునంతా పాటలో దించి
ద్వంద్వార్థాల పదాలు అందులో కూర్చి
లేత యువ హృదయాలకు గాలం గుచ్చి
హోరెత్తిన ధ్వనులే సంగీతమని వూగుతున్నారు
పిచ్చి చేష్టలే నృత్య రీతులని చెలరేగుతున్నారు
శృతి తప్పిన గీతంలా గతి తప్పిన సమాజంలో
మతి తప్పిన మనిషి సంచరిస్తున్న వానరం
పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పెట్టిన
సారాయి పాటలు
స్వర నేరాలకు ఘోరాలకు చిరునామా
పెరిగిన అరాచక కిరాయి మూకల సాక్షిగా
లాభాపేక్షతో పాట పాడిన పావనమ్మ పాట
పాట కాని పాట

- అందె నరసింహారావు

కెరటం



ఐసియులో అచేతనంగా పడివున్న కూతుర్ని చూసేసరికి ఆ తల్లిదండ్రులకు కన్నీరాగలేదు. ఎప్పుడూ తుళ్లుతూ, గెంతుతూ గలగలా మాట్లాడే తమ గారాల పట్టిని అలా స్పృహ లేకుండా చూడలేకపోయారు. నీళ్లలో చేపలా ఈదులాడే చిన్నారి ఇలా మంచానికి అతుక్కుపోవడం వారికేమాత్రం జీర్ణంకాలేదు.



ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండానే కొన్ని సంఘటనలు జరిగిపోతుంటాయి. పదమూడేళ్ల హేమిల్టన్ జీవితంలోనూ అలాంటి ఘటన ఒకటి చోటుచేసుకుంది. అది 2003, అక్టోబర్ 31వ తేదీ. ఉదయం 7.30 గంటలు. ఆ సమయంలో తన నేస్తం అలనాతో కలిసి టనెల్స్ బీచ్ (హవాయి) లో సర్ఫింగ్‌కు వెళ్లింది హే. వీళ్ల వెంట అలనా తండ్రి, సోదరుడు కూడా వున్నారు. నల్గురూ ఎంతో ఉత్సాహంగా కెరటాలపై చెక్కబల్లమీద నిలబడి ఆటలాడుతున్నారు.

హే, అలనా, ఆమె సోదరుడు...ముగ్గురూ పోటీలు పెట్టుకుని మరీ సర్ఫింగ్ చేస్తున్నారు. బీచ్‌లో అలలమీద సర్ఫ్‌బోర్డుపై నిలబడి నేస్తాలను అధిగమించి ముమ్ముందుకు వెళుతోంది హే. తన పిల్లలకంటే మెరుగైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న హేని చూచి అలనా తండ్రికి ఓ క్షణం అసూయ కలిగిన మాట వాస్తవం. సముద్రుడి తడిమీద, భానుడి లేలేత కిరణాలు పడి హేమిల్టన్ సర్ఫింగ్ క్రీడా రారాణిలా మెరిసిపోతోందా క్షణంలో. తన కూతురు కూడా అంత బాగా సర్ఫింగ్ చేయగలిగితే ఎంత బాగుండని అలనా తండ్రి తలపోసినా... హే కూడా తన బిడ్డలాంటిదే కదా అని సరిపెట్టుకున్నాడు.

సర్ఫింగ్ చేసి అలసిసొలసి సర్ఫ్‌బోర్డు ఆధారంగా సేదతీరుతోంది హే. సరిగ్గా ఆ సమయంలో 15 అడుగుల టైగర్ షార్క్ రూపంలో పెను ప్రమాదం ఒకటి పొంచి వుందని ఆమెకు తెలీదు. షార్క్ చేప రావడం హే ఎడమ చేతిని కొరికి చప్పరించుకుంటూ వెళ్లిపోవడం క్షణాల్లో జరిగిపోయింది. సరిగ్గా భుజం కింది వరకు చెయ్యి పోవడంతో ఒక్కసారిగా రక్తం ఎగజిమ్మింది. అసలు తనకేం జరిగిందో తెలియని షాక్‌లో రక్తాన్ని చూసేసరికి హే పిచ్చిగా కేకలు వేసింది.

అలనా...ఆమె తండ్రి...సోదరుడు కలిసి హేను ఒడ్డుకు చేర్చారు. అప్పటికే శరీరంలోని 60 శాతం రక్తం కారిపోయింది. క్షణాల్లో ఆమెను విల్‌కాక్స్ మెమోరియల్ ఆసుపత్రికి చేర్చారు.

◆◆◆

ఐసియూ గది అద్దాల్లోంచి కూతుర్నే రెప్పవేయకుండా చూస్తున్నాడు తండ్రి. ఆయనలో ఓ రకమైన నిర్వేదం చోటుచేసుకుంది. 'విధి కాకపోతే సరిగ్గా నేను ఆపరేషన్ చేయించుకోవాల్సిన ఆస్పత్రిలో నా చిన్నారి హే చేరడమేమిటి? నా మోకాలి ఆపరేషన్ బదులుగా దాని చేతి ఆపరేషన్ జరగడమేమిటి? ఇక తను జీవితాంతం ఒంటి చేత్తో బతకాల్సిందేనా! మళ్లీ సర్ఫింగ్ చేయగలదా! అన్నం తినకుండా అయినా వుండగలదుగానీ ... సర్ఫింగ్ చేయకుండా వుండలేదే! ఆ రెండు చేతులతో ఎన్నెన్ని బహుమతులు తెచ్చి చూపించిందో నా చిన్నారి హే. ఎనిమిదేళ్లకే సర్ఫింగ్ పోటీల్లో పాల్గొని తనకంటే పెద్ద పిల్లలను కూడా సునాయాసంగా ఓడించి మొదటి స్థానంలో నిలిచేది. దాని ఊపిరి...శ్వాస...మాట...తిండి...అన్నీ సర్ఫింగే. మరి ఇక మీదట అది అసాధ్యమేనా!" అనుకుంటూ అలా ఆస్పత్రి నేలమీదే జారిగిలపడ్డాడు. అవతల హే తల్లి మనోవేదన కూడా దాదాపు అలాగే వుంది.

◆◆◆

ఆరు రోజుల తర్వాత ఆస్పత్రి నుంచి ఇంటికి చేరింది హే. ఇంట్లో మంచం మీద వుండి కూడా ఆమె ఆలోచనలన్నీ సర్ఫింగ్ గురించే. 'ఒంటి చేత్తో సర్ఫింగ్ చేయొచ్చా!? వీలవుతుందా?!' అన్న ప్రశ్నలు ఆమె మనసును తొలిచేసేవి.

దుర్ఘటన జరిగిన మూడు వారాలకే హే తిరిగి సర్ఫింగ్ చేయాలనుకుంది. మామూలుగా కంటే పొడవాటి, మందపాటి సర్ఫ్‌బోర్డు తయారుచేయించుకుంది. దాంతో బీచ్‌కి బయలుదేరింది. అయితే ఒంటి చేత్తో సర్ఫింగ్ చేయడం అంత సులువు కాదని గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదామెకు. అయినా సరే ఏమాత్రం వెనకంజ వేయలా. పైగా మరింత పట్టుదలతో, మరింత శక్తిని కూడగట్టుకుని తనకు తనే సర్ఫింగ్ నేర్చుకుంది. తపనతో సాధించింది. తిరిగి సర్ఫింగ్ పోటీల్లో పాల్గొని విజయలక్ష్మిని సొంతం చేసుకోసాగింది. 2004 జులైలో ఐఎస్‌పివై అవార్డు కైవసం చేసుకొంది. ఆ ఏటి బెస్ట్ కమ్‌బ్యాక్ అవార్డు అది. 2005 జాతీయ సర్ఫింగ్ పోటీలో ప్రథమ స్థానంలో నిల్చింది. షార్క్ తన చేతిని మింగేయక ముందు ఆమె కన్న కల అది. తర్వాత సాకారం చేసుకోగలిగింది. 2008 నుంచి పూర్తిగా సర్ఫింగ్ మీదే దృష్టి పెట్టింది. ఎన్నో బహుమతులు, అవార్డులు ఆమె పట్టుదలకు, కృషికి దాసోహం అన్నాయి. ఎన్నో టీవీ చానళ్లు, పత్రికలు ఆమె ఇంటర్వ్యూలు ప్రసారం చేశాయి. ఎం.టి.వి ప్రచురణ విభాగం హేమిల్టన్ జీవితాన్ని గ్రంథస్తం చేసింది. శరీరంలో ఒక భాగం కోల్పోయినందుకు నిరాశపడకుండా, కృంగిపోకుండా పట్టుదలతో విజయాలు సాధిస్తూ ఎందరికో స్ఫూర్తినిస్తోంది హే.

- చరిత

ఎన్ని పింగాణీ పిల్లులో!

సేకరణ కొందరికి హాబీ. పెన్నులు, పెన్సిళ్లు, స్టాంపులు, పుస్తకాలు, బొమ్మలు, బ్యాట్లు, థర్మామీటర్లు, పాల డబ్బాలు... ఇలా రకరకాల వస్తువులను సేకరిస్తుంటారు. కొందరైతే ఏకంగా దేవుడి బొమ్మలే పోగు చేస్తుంటారు. సర్సరి. అది ఒక్కొక్కరిది ఒక్కో ఆసక్తి. ఇదిగో ఇవాళ పిల్లి బొమ్మలంటే ప్రాణం ఇచ్చే బామ్మగారి గురించి చెప్పుకుందాం. ఈవిడ గత 60 సంవత్సరాలుగా పిల్లి బొమ్మలు సేకరిస్తోంది. అదీ పింగాణీతో చేసిన బొమ్మలంటే ఆవిడకు మహా ఇష్టం. ఇప్పటికి సరిగ్గా 2222 బొమ్మలను పోగేసింది. రకరకాల సైజులు, రంగుల్లో పిల్లులు చూడండి వీర ఫోజులిచ్చాయి. వాటిని తన పడక గదిలో సర్దేసింది. వుండేకొద్దీ వాటి సంఖ్య పెరిగిపోయి ఆ గదిలోకి వెళ్లేందుకు కూడా స్థలం లేకుండా పోయింది. ఇంతకీ ఈ బొమ్మల ఖరీదు ఎంత వుంటుందనుకుంటున్నారు? 50,000 పౌండ్లు. వాటి ఆభరణాల విలువే 1,000 పౌండ్ల వరకు వుంటుందట. ఆమె దగ్గర క్రీస్తుపూర్వం 600 ఏళ్ల నాటి పిల్లి బొమ్మ కూడా వుందండోయ్. ఇంతకీ బామ్మగారి పేరు చెప్పుకోలేదుకదూ. పామీలా కోల్. బర్మింగ్‌హామ్ వాసి. 1940ల్లో ఆమెకు ఓ పిల్లి బొమ్మను బహూకరించింది తల్లి. ఇంక అప్పటినుంచి ఆ బొమ్మల సేకరణపై మోజు పెంచుకుంది పామీలా. వీటిని ఆమె ప్రపంచం నలుమూలల నుంచి తెప్పించుకుంది. ముఖ్యంగా వాటిని చైనా షాపుల్లో, బొమ్మల అంగళ్లలో, ఎగ్జిబిషన్లలో కొనుగోలు చేసింది. మరో తమాషా ఏంటంటే ప్రపంచంలో ఉన్న అన్ని ఖండాల నుంచి తెప్పించిన బొమ్మలున్నాయి ఆమె దగ్గర.

కోళ్ల హోటల్

మీరు చాలా రకాల హోటళ్లను చూసి వుంటారు. వాటి గురించి కథలు కథలుగా విని వుంటారు. కానీ ఖచ్చితంగా ఇప్పుడు చెప్పుకోబోయే లాంటి దాన్ని గురించి మాత్రం విని వుండరు. అవునండీ! కోళ్ల హోటల్ చూశారా మీరెప్పుడైనా. జోక్ కాదు! కోళ్ల హోటల్ వుంది. ఎక్కడనుకుంటున్నారు! హెల్‌స్టన్‌లో. ప్రపంచంలోనే తొలిసారిగా కోళ్లకోసం ప్రత్యేకంగా పెట్టిన హోటల్ ఇది. 31 ఏళ్ల డేవిడ్ రాబర్ట్స్‌కు ఈ వినూత్న ఆలోచన వచ్చింది. ఇళ్లల్లో కోళ్లుంటే రెండురోజులు బయటికి పోవడానికి వుండదు. వాటికి తిండి పెట్టాలి. నీళ్లు పట్టాలి. రాత్రుళ్లు జాగ్రత్తగా బుట్ట కింద పెట్టాలి. అవి పెట్టిన గుడ్లు సేకరించాలి. ఇన్ని తతంగాలుంటాయి. అందుకే ఆ సమస్యకు పరిష్కారంగానే ఈ హోటల్‌ను ఏర్పాటు చేశాడు డేవిడ్. మొన్న క్రిస్టమస్ సీజన్‌లో హోటల్ నిండిపోయింది. కస్టమర్లను (కోళ్లను) జాగ్రత్తగా చూసుకోవడమే ఇక్కడి ఉద్యోగుల పని. ఉదయాన్నే బఫే తరహా అల్పాహారం. స్థానికంగా లభించే వాటితో మధ్యాహ్నం, రాత్రి భోజనం వుంటుంది. అదీ నాలుగ్గోడల మధ్య కాదు! ఎంచక్కా చల్లగాలి ఆస్వాదిస్తూ ఆరుబయట. ఇలా కోడి వుండడానికిచ్చిన గూడు కోసం 2 పౌండ్లు, కోడికి పెట్టే తిండి, పర్యవేక్షణకోసం 75 పెన్స్ వసూలు చేస్తారు.

తెలుసా!

ఖరీదైన మంచం

ఆ మంచంమీద కునుకు తీయాలంటే పెట్టి పుట్టాలండోయ్! ఏంటట అంత ప్రత్యేకత అంటారేమో! చాలానే వుంది. దీని ఖరీదే 4 మిలియన్ పౌండ్లు. ధర వింటేనే కళ్లు తిరుగుతున్నాయికదూ. అది సరే...ఇంత ఖరీదు పెట్టడానికి దానికి బంగారం మెత్తారా! వజ్రాలు పొదిగారా!! అంటారేమో? మీ అనుమానం నిజమే. ఈ మంచం తయారీలో అవన్నీ ఉపయోగించారు. ఇంకా ఇటలీ సిల్కు కూడా వాడారు. అంతేకాదండోయ్! మంచం తయారీకి వాడిన కలప కూడా చాలా ఖరీదైనది. వెరసి...అంత రేటు పలుకుతోంది. దీన్ని 39 ఏళ్ల లివర్‌పుడ్లిన్ తయారుచేశాడు. ఇదే కాదండోయ్! దీనితోపాటు మరో మంచం కూడా చేశాడు. దాన్ని ఓ ఇటలీ వ్యాపారవేత్త కొనుక్కొని హాయిగా కునుకు తీసేస్తున్నాడు. ఇప్పుడీ మంచాన్ని ఎవరు కొనుక్కుంటారో ఏమో? చూద్దాం!



ఇ - మెయిల్‌కు ఎన్నేళ్లో తెల్సా!

ఇ-మెయిల్ నేడు అత్యంత సులభమైన సమర్థవంతమైన సమాచార మాధ్యమంగా ఏర్పడిన విషయం అందరికీ తెలిసిందే. అధికశాతం ప్రజానీకం ఉత్తరాలు రాసుకోవడం ఎప్పుడో మర్చిపోయారు. టెలిఫోన్ నంబర్లు, అడ్రస్‌లను గుర్తుంచుకోవడం మానేసి, కేవలం 'ఇ-మెయిల్ ఐడి' లనే గుర్తుంచుకుంటున్నారు. కంప్యూటర్‌తో పరిచయమున్న ప్రతిఒక్కరూ తమ క్షేమ సమాచారాలను తెలపడానికి పూర్తిగా ఇ-మెయిల్‌పైనే ఆధారపడుతున్నారంటే నేటి ఆధునిక జీవితంలో ఇ-మెయిల్ ఎంతటి ప్రాధాన్యత సంతరించుకుందో అర్థమవుతోంది. సుమారు ఐదారేళ్ళ క్రితం వరకూ అతికొద్ది మంది మాత్రమే ఉపయోగించే ఇ-మెయిల్ నేడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఎక్కువగా ఉపయోగిస్తున్న సమాచార సాధనంగా మారిపోయింది. మరి అంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఇమెయిల్ ఎప్పుడు ఎలా పుట్టింది? దాని వయసెంత? వంటి ఆసక్తికర వివరాలు తెలుసుకుందామా!

తొలి ఇమెయిల్ పంపింది ఇక్కడే మరి



టామ్లిన్ సన్

రాడికాటి గ్రూప్ అనే సంస్థ చేసిన అధ్యయనం ప్రకారం మే, 2009 నాటికి ప్రపంచవ్యాప్తంగా 1.9 బిలియన్ ఇ-మెయిల్ వినియోగదారులు ఉండగా, 2014 నాటికి ఈ సంఖ్య 2.5 బిలియన్లకు పెరుగుతుందని అంచనా. ఇదే సంస్థ ఏప్రిల్ 2010లో నిర్వహించిన లెక్కల ప్రకారం సుమారుగా రోజుకి 294 బిలియన్ ఇమెయిళ్ల బట్వాడా జరుగుతోంది. రోజుకి 294 బిలియన్ మెసేజ్‌లంటే ప్రతి నిమిషానికి 2.8 మిలియన్లకుపైగా ఇమెయిళ్లు పంపుకుంటున్నారు. అంటే సంవత్సరానికి 90 ట్రిలియన్ ఇమెయిళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. మిలియన్ల కొద్దీ బట్వాడా అవుతోన్న ఇమెయిల్స్‌లో సుమారుగా 90% స్పామ్, వైరస్‌లకు సంబంధించిన మెయిల్సే వుంటున్నాయి. 1.9 బిలియన్ వినియోగదార్ల నుండి మాత్రమే స్వచ్ఛమైన మెయిళ్ల పంపిణీ జరుగుతోంది. 1972లో పుట్టి ప్రపంచవ్యాప్తంగా మిలియన్లకొద్దీ జనానికి సేవలందిస్తున్న ఇమెయిల్‌కు 38 సంవత్సరాలు నిండాయి.

అమెరికా ఇంజనీర్ రే టామ్లిన్‌సన్‌ను ఇ-మెయిల్‌కు పితామహునిగా చెబుతారు. ఈయన పూర్తి పేరు రేమాండ్ శామ్యూల్ టామ్లిన్‌సన్. 1971లో బిబిఎన్ టెక్నాలజీస్‌కు చెందిన ప్రోగ్రామర్లలో ఒకరిగా పనిచేసిన రే టామిలిన్సన్‌ను దీనిని కనుగొన్నారు. అప్పట్లో అమెరికా రక్షణ శాఖకు చెందిన ఆర్పానెట్ అభివృద్ధిలో భాగంగా బిబిఎన్ టెక్నాలజీస్‌ను కాంట్రాక్ట్ పద్ధతిలో అభివృద్ధి చేసేది. ఆ సమయంలో 10 డిజిటల్ పిడిపి కంప్యూటర్ల మధ్య టెనెక్స్ అనే టైమ్ షేరింగ్ సిస్టమ్‌ని అభివృద్ధి చేసేవారు. అప్పటికే ఈ కంప్యూటర్లపై "సెండ్ మెసేజ్" (SNDMSG) అనే ఒక మెయిల్ ప్రోగ్రామ్‌ని ఉపయోగించేవారు. అయితే ఈ మెయిల్ ప్రోగ్రామ్ ఒకే కంప్యూటర్‌పై ఒక యూజర్ నుంచి మరో యూజర్‌కి మెసేజ్ అందించడానికి మాత్రమే ఉపయోగపడేది. అంటే ఒక కంప్యూటర్‌ను ఒకరికంటే ఎక్కువమంది ఉపయోగిస్తుంటే... ఒక వినియోగదారుడు అదే కంప్యూటర్‌పై పనిచేయబోయే మరో వినియోగదారునికి మెసేజ్‌ని ఇవ్వడానికి ఉపయోగించేవారన్న మాట. దీనిని స్టిక్ ప్యాడ్లతో పోల్చవచ్చు. ఒక వ్యక్తి కొంత సాఫ్ట్‌వేర్‌ని డెవలప్ చేసి, తరువాత ఆ కంప్యూటర్‌పై దానిని డెవలప్ చేయబోయే మరో వ్యక్తికి అవసరమైన సూచనలు ఇవ్వడానికి ఈ ప్రోగ్రామ్‌ని ఉపయోగించేవారు. ఇటువంటి సింగిల్ కంప్యూటర్ ఇ-మెయిల్ ప్రోగ్రామ్‌లను 1960 నుంచి ఉపయోగించేవారు. ఈ 'సెండ్ మెసేజ్' మెయిల్ ప్రోగ్రామ్ మెయిల్‌ని కంపోజ్ చేసి, వేరే వినియోగదారుని మెయిల్ బాక్స్‌కి పంపించడానికి వీలు కల్పించేది. నిజానికి మెయిల్ బాక్స్ అనేది ఒక ప్రత్యేకమైన పేరుతో ఉండే ఫైల్‌గానే ఉండేది. అయితే అది అడ్రస్ చేయబడిన వినియోగదారుడు తప్ప వేరెవరూ ఆ ఫైల్‌ని తెరవగల అవకాశం ఉండేది కాదు. ఆ ఫైల్‌కి కొత్త సమాచారం జత చేయడం ద్వారా ఆ వ్యక్తికి మెయిల్ పంపేవారు. ఇదే సమయంలో ఒక కంప్యూటర్ నుంచి మరొక కంప్యూటర్‌కి డేటా బట్వాడా చేయడానికి CPYNET అనే ట్రాన్స్‌ఫర్ ప్రోగ్రామ్‌ని ప్రయోగాత్మకంగా పరిశీలించారు.

అయితే ఈ రెండు ప్రోగ్రామ్‌లనూ కలిపి ఒక సరికొత్త ఇ-మెయిల్ ప్రోగ్రామ్‌ని తయారుచేసేందుకు ఉపక్రమించారు రే టామ్లిన్‌సన్. CPYNETలో కొత్త ఫైల్ పంపించడానికి ఆస్కారం ఉండేది కాని, పాత ఫైల్‌కి మరేదైనా జత చేసే వీలుండేది కాదు. ఈ CPYNE ప్రోటోకాల్‌కి కొద్ది మార్పులు చేయడం ద్వారా పాత ఫైల్‌కి సమాచారం అనుబంధంగా చేర్చే వీలు కలిగింది. కేవలం 200 లైన్ల అదనపు కోడ్‌తో CPYNET కోడ్‌ని 'సెండ్ మెసేజ్'లో కలిపి తయారుచేయడం ద్వారా తొలి ఇ-మెయిల్ ప్రోగ్రామ్ ఉద్భవించింది. యూజర్ పేరుకు, హోస్ట్ పేరుకూ అంతరాన్ని గుర్తించడానికి వీలుగా టామ్లిన్‌సన్ ఉపయోగించిన @ గుర్తునే నేటికీ ఉపయోగిస్తున్నారు. ఈయన తొలిసారిగా పక్క పక్కనే ఉన్న రెండు కంప్యూటర్ల మధ్యలో ఈ ఇ-మెయిల్ మెసేజ్‌ని పంపించి పరీక్షించారు. ఈ విధంగా పరీక్షించడానికి పంపించిన తొలి మెసేజ్ "QWERTYUIOP". ఇవి కీబోర్డు పైవరుసలోని అక్షరాలు. ఈ అక్షరాలను కీబోర్డ్‌పై వరుసగా టైప్ చేయడం ద్వారా టెస్ట్ చేసినట్లుగా చెప్పుకునే ఈ తొలి మెసేజ్ తరువాత ఇప్పటికి కొన్ని వేల కోట్ల ఇ-మెయిల్ మెసేజ్‌లు బట్వాడా అయి ఉంటాయి. 1972లో టెనెక్స్‌తో పాటుగా అందించబడిన ఈ తొలి ఇ-మెయిల్ ప్రోగ్రామ్‌ని తయారు చేసిన రే టామ్లిన్‌సన్ చిరస్మరణీయుడు. ఆయనను, ఆయన రాసిన తొలి మెయిల్ ప్రోగ్రామ్‌ని మర్చిపోయినా, మానవాళి ఉన్నంతకాలం, ఇ-మెయిల్స్ ఉపయోగించినంత కాలం ఆయన ఉపయోగించిన @ సింబల్‌ని మర్చిపోలేం.

-కె.ఎక్స్.రాజు



టోపు రబ్రి

కావలసిన పదార్థాలు

పాలు - 2 కప్పులు

తరిగిన టోపు - 75 గ్రా

చక్కెర పొడి - 4 స్పూన్లు

మొక్కజొన్న పిండి (కార్న్‌ఫ్లోర్) - ఒకటిన్నర స్పూను

యాలకులు - 3

పిస్తాపప్పు ముక్కలు - 1 స్పూను

బాదంపప్పు ముక్కలు - 1 స్పూను

తయారు చేసే విధానం

మొక్కజొన్న పిండిని పాలల్లో కలపాలి. మందపాటి అడుగు ఉన్న బాండీలో దీన్ని పోసి కలియదిప్పుతూ మరిగించాలి. తర్వాత ఆ పాలల్లో సన్నగా తరిగిన టోపును కలపాలి. అందులోనే చెక్కెర వేసి కలియదిప్పుతూ సన్నని సెగపై మగ్గనివ్వాలి. ఈ మిశ్రమం గట్టిపడ్డ తర్వాత పొయ్యిమీద నుండి దించి చల్లార్చి యాలకుల పొడి, పిస్తా, బాదంపప్పు ముక్కలు కలపాలి. ఇది ఎంత చల్లగా ఉంటే అంత రుచిగా ఉంటుంది.

టోపు బుర్జి



కావలసిన పదార్థాలు

టోపు - 200 గ్రా

టమాటాలు - 2

పెద్ద ఉల్లిపాయ - 1

కారం - రుచికి తగినంత

జీలకర్ర - అరస్పూను

అల్లం వెల్లుల్లి ముద్ద - 1స్పూను

క్యాప్సికం - 1

ఉప్పు - తగినంత

నూనె - 2 స్పూన్లు

పసుపు - చిటికెడు

తయారు చేసే విధానం

టోపు, క్యాప్సికమ్, ఉల్లిపాయ, టమాటాలను చిన్న ముక్కలుగా తరగాలి. బాండీలో నూనె వేసి కాగాక జీలకర్ర వేసి వేయించాలి. తర్వాత అల్లం వెల్లుల్లి ముద్ద, ఉల్లిపాయ ముక్కలు వేయించాలి. పసుపు, కారం, ఉప్పు, తరిగిన ముక్కలు వేసి ఉడకనివ్వాలి. ఇది నీరంతా ఇంకిపోయి పొడి అయ్యేవరకు కలుపుతూ ఉండాలి. అంతే టోపు బుర్జి రెడీ. ఇది చపాతీల్లోకి బావుంటుంది.

కడై టోపు

కావలసిన పదార్థాలు

టోపు - పావుకిలో, క్యాప్సికమ్ - 2

నూనె - 2 స్పూన్లు, వెల్లుల్లి - 5 రెబ్బలు

తరిగిన ఉల్లిపాయ - 1, టమాటా గుజ్జు - 4 స్పూన్లు

కారం - రుచికి సరిపడా, ఉప్పు - రుచికి సరిపడా

ధనియాల పొడి - అర స్పూను, గరం మసాలా - అర స్పూను

కసూరిమెంతి - 1 స్పూను, పసుపు - చిటికెడు

తయారు చేసే విధానం

టోపు, క్యాప్సికమ్ పొడవుగా సన్నగా ముక్కలు కోయాలి. వీటిలో అరకప్పు నీళ్లు పోసి నీరంతా ఇంకే వరకు ఉడికించాలి. బాండీలో నూనె వేడి చేయాలి. అందులో చిదిమిన వెల్లుల్లి, తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి వేయించాలి. తర్వాత అందులోనే టమాటా గుజ్జు, కారం, ఉప్పు, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా వేసి రెండు నిమిషాలు ఉడికించాలి. అందులో ఉడికించిన టోపు, క్యాప్సికమ్ ముక్కలు, కసూరిమెంతి వేసి కలియదిప్పాలి. ఈ కూరని చపాతీతో తింటే చాలా బావుంటుంది.



సమోస

కావలసిన పదార్థాలు

సోయా గ్రాన్యూల్స్ - 50 గ్రా, బంగాళ దుంపలు - 2

జీలకర్ర - 1 స్పూను, అల్లం వెల్లుల్లి ముద్ద - 2 స్పూన్లు

పచ్చిమిర్చి - 5, కారం - 1 స్పూను

ధనియాలపొడి - 1 స్పూను

ఉప్పు - తగినంత, ఛాట్ మసాలా - 2 స్పూన్లు

మైదాపిండి - పావుకిలో, నెయ్యి - 2 స్పూన్లు

వాము - 1స్పూన్, నూనె - వేయించడానికి సరిపడా

తయారు చేసే విధానం

సోయా గ్రాన్యూల్స్‌ని వేడినీళ్లలో పావుగంట నానబెట్టి నీరు లేకుండా పిండాలి. బంగాళ దుంపల్ని ఉడకబెట్టి మెత్తగా చిదపాలి. దానిలో మైదాపిండి, నెయ్యి, వాము, ఉప్పు కలిపి చపాతీ ముద్దలా చేసి తడిగుడ్డతో కప్పి ఉంచాలి. బాండీలో రెండు స్పూన్ల నూనె వేసి వేడి చేసి జీలకర్ర వేయించాలి. అందులోనే అల్లం వెల్లుల్లి ముద్ద, పచ్చిమిర్చి ముక్కలు, కారం, ధనియాల పొడి, ఉప్పు, ఛాట్ మసాలా వేసి కలపాలి. తర్వాత సోయా గ్రాన్యూల్స్, చిదిపిన బంగాళ దుంపలు వేసి ఉడికించాలి. సమోసా లోపల పెట్టే కూర సిద్ధమైనట్టు. ఇప్పుడు తడిపి ఉంచుకున్న చపాతీ ముద్దను చిన్న ఉండలు చేసి కోడుగుడ్డు ఆకారంలో రుద్ది, రెండుగా కొయ్యాలి. ఒక్కో ముక్కను శంఖంలా చుట్టి దానిలో గ్రాన్యూల్స్ బంగాళదుంప కూరను కూరి అంచులను తడిచేసి మడవాలి. వీటిని బంగారు రంగు వచ్చేవరకు నూనెలో వేయించాలి. అంతే సమోసా రెడీ.



హిమాంశు రాయ్

భార్య దేవికారాణితో హిమాంశు రాయ్


శ్రీరాజ్ లో ఓ దృశ్యం...

'అఛూత్ కన్య' లో...

లైట్ ఆఫ్ ఏషియా లో...

మూకీల నాటి మహా నిర్మాత.. నటుడు హిమాంశురాయ్!

ప్రస్తుతం ముంబయ్‌లో ఎంతో అనాకర్షణీయంగా ఉన్న పారిశ్రామిక స్థలం అది. ఆ స్థలాన్ని చూస్తే, ఒకప్పుడు అక్కడ ఓ చక్కటి సినిమా స్టూడియో ఉండేదనీ, ఎన్నో మంచి చిత్రాలు అక్కడ తయారయ్యాయనీ ఎవరూ ఊహించలేరు. ఆ ఫిల్మ్ స్టూడియో పేరు - 'బాంబే టాకీస్'. దాని అధినేత - హిమాంశు రాయ్. సినిమా పట్ల ఆయనకున్న అపారమైన ప్రేమ, చేసిన నిర్విరామ కృషి కారణంగానే అక్కడ ఆ స్టూడియో వెలసింది. భారత చలనచిత్ర చరిత్రలో సువర్ణాధ్యాయం లిఖించిన హిమాంశు రాయ్‌ని స్మరిస్తూ, మహాకవి శ్రీశ్రీ "తురాయి కంటె ఆ / కు రాయి కంటె, కీ / చు రాయి కంటె - హిమాం / శు రాయి గొప్పవాడు" అని 1940లోనే అన్న మాటలు సుప్రసిద్ధం.

- రెంటాల జూనియర్

హిమాంశు రాయ్ సమకాలంలోనే చాలా మంది ఔత్సాహికులు సినీ రంగంలోకి వచ్చారు. ఎంతో మందికి మార్గదర్శకులుగా నిలిచారు. అయితే, వాళ్ళలోని చాలా మందికీ, హిమాంశు రాయ్‌కీ ఓ తేడా ఉంది. వారిలో చాలా మంది అనుకోకుండా సినీ రంగంలోకి వచ్చిపడితే, హిమాంశు రాయ్ మాత్రం అలా కాకుండా, ఏరి కోరి సినీ రంగాన్ని ఎంచుకున్నారు. భారతదేశంలో సినిమా రంగం శైశవ దశలో ఉన్నప్పుడే, ఈ రంగానికి ఎంతో భవిష్యత్తు ఉందని ఆయన ముందు చూపుతో గ్రహించారు.

చదువుకొనే రోజుల్లోనే సినిమాల పట్ల ఆసక్తి

హిమాంశు రాయ్ తూర్పు బెంగాల్ (ఇప్పటి బంగ్లాదేశ్)లో ఢాకా సమీపంలోని ఓ గ్రామంలో ఓ సంపన్న బెంగాలీ కుటుంబంలో 1892లో జన్మించారు. ఆయన బి.ఏ. పూర్తయిన తరువాత న్యాయశాస్త్ర విద్యను అభ్యసించడం మొదలుపెట్టారు. ఆ తరువాత న్యాయవిద్యను కొనసాగించడం కోసం లండన్‌లోని ఇన్నర్ టెంపుల్‌లో చేరారు. మొదటి నుంచి కళల పట్ల, ముఖ్యంగా రంగస్థల కళల పట్ల ఆసక్తి ఉన్న ఆయన అలా లండన్‌లోని నాటక సమాజాల వైపు ఆకర్షితులయ్యారు. అక్కడ కొన్ని నాటకాలలో ఆయన చిన్నా చితకా పాత్రలు ధరించారు. కొంతమంది రంగస్థల ఔత్సాహికులను ఓ జట్టుగా ఏర్పరిచి, నాటకాలు ప్రదర్శించేవారు. ఆ సందర్భంలోనే ఆయనకు లండన్‌లో ఉంటున్న భారతీయ నాటక రచయిత నిరంజన్ పాల్‌తో పరిచయమైంది. ఆ స్నేహం పదిహేనేళ్ళ పాటు కొనసాగింది.

అలా కలిసిన నిరంజన్ పాలే తరువాతి రోజుల్లో హిమాంశు రాయ్‌కి స్క్రిప్ట్ రచయిత అయ్యారు. వారిద్దరూ కలిసి మూడు మూకీ చిత్రాల రూపకల్పన చేశారు. అవి - 'లైట్ ఆఫ్ ఏషియా' (1926), 'షిరాజ్' (1928), 'ఎ త్రో ఆఫ్ డైస్' (1930). ఈ మూడు చిత్రాలలోనూ రాయ్ స్వయంగా నటించారు. దర్శకుడు ఫ్రాంజ్ ఓస్టెన్ నేతృత్వంలోని జర్మనీ బృందం ఆ సినిమాలను చిత్రీకరించింది. కాగా, ఈ మూడు భారతీయ మూకీ చిత్రాలూ జర్మన్, బ్రిటీషు సంస్థలు సహ - నిర్మాతలుగా రూపొందినవే కావడం విశేషం.

అంతర్జాతీయ భాగస్వామ్యంలో తొలి భారతీయ చిత్రం

అప్పట్లో హిమాంశు రాయ్ తీసిన మూకీ చిత్రం అనగానే మనకు మొట్టమొదట గుర్తొచ్చేది - 'ది లైట్ ఆఫ్ ఏషియా' (లేదా 'ప్రేమ్ సన్యాస్') చిత్రం. మన దేశంలో ఇంకా టాకీలు రాని రోజులవి. హిమాంశు రాయ్‌కి ఉన్న ఓర్పు, అవతలి వాళ్ళను ఒప్పించే నేర్పు కారణంగా ఈ చిత్రం తయారైంది. ఆ చిత్ర నిర్మాణం కోసం హిమాంశు రాయ్ చాలా కృషే చేశారు. 1924 తొలి రోజుల్లో ఆయన ఏకంగా జర్మనీలోని మ్యూనిచ్ నగరానికి వెళ్ళి, అక్కడి సుప్రసిద్ధ చిత్ర నిర్మాత పీటర్ ఆస్టెర్‌మెయెర్‌ను కలిశారు. అలా ఆ ఏడాదే ఆ చిత్ర నిర్మాణం మొదలైంది. ఢిల్లీకి చెందిన గ్రేట్ ఈస్టర్న్ ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థ ఈ చిత్రానికి భారతీయ నిర్మాతగా వ్యవహరించింది. 'లైట్ ఆఫ్ ఏషియా' చిత్రం భారతీయ మూకీ చిత్రాల చరిత్రలో మరపురాని ఘట్టం.

ఆ చిత్రంలో హిమాంశు రాయ్, సీతాదేవిగా ప్రాచుర్యం పొందిన ఆంగ్లో - ఇండియన్ నటి రెనీ స్మిత్ ఆ చిత్రంలో నటించారు. అప్పట్లో ఆ చిత్రం ఐరోపాలో విస్తృత స్థాయిలో వాణిజ్య విజయాన్ని అందుకుంది. విమర్శకుల ప్రశంసలు కూడా పొందింది. అయితే, మన దేశంలో మాత్రం సరైన ప్రచారం లేకపోవడంతో ఆశించినంతగా ఆడలేదు. 1925లో విడుదలైన అత్యుత్తమ చిత్రాల్లో 'ది లైట్ ఆఫ్ ఏషియా' ఒకటని లండన్‌కు చెందిన 'టైమ్స్' పత్రిక ప్రశంసించింది.

అభిరుచులు కలసిన రాయ్ - దేవికా రాణి

ఆ తరువాత కొద్ది కాలానికే 'షిరాజ్' (1928), 'ఎ త్రో ఆఫ్ డైస్' ('ప్రపంచ పాశ్') (1930) అనే మరో రెండు మూకీ చిత్రాలను హిమాంశు రాయ్ నిర్మించారు. బ్రిటన్‌కు చెందిన బ్రిటిష్ ఇన్‌స్ట్రక్షనల్ ఫిల్మ్స్, హిమాంశు రాయ్, జర్మనీకి చెందిన సుప్రసిద్ధ యు.ఎఫ్.ఏ. స్టూడియోస్ కలసి ఈ చిత్రాలు తీశారు. తాజ్ మహల్ నిర్మాణం వెనుక ఉన్న విషాదభరిత ప్రేమకథను 'షిరాజ్' చిత్రం తెరకెక్కించింది. ఆ

సమయంలోనే లండన్‌లో నిరంజన్ పాల్ ఇంట్లో దేవికా రాణితో రాయ్‌కు పరిచయం కలిగింది. ఆ పరిచయం ప్రేమగా, చివరకు పరిణయంగా మారింది. 1929లో రాయ్, దేవికా రాణి పెళ్ళి చేసుకున్నారు. ఆ తరువాతే 'ఎ త్రో ఆఫ్ డైస్' చిత్ర నిర్మాణం సాగింది.

ఆ రెండు చిత్రాలూ విజయం సాధించడంతో, హిమాంశు రాయ్ తగినంత చొరవ, వనరులు ఉన్న నట - నిర్మాతగా స్థిరపడ్డారు. నిర్మాణానంతర పనులన్నీ బెర్లిన్‌లోని యు.ఎఫ్.ఏ. స్టూడియోస్‌లో జరిగేవి. ఫలితంగా అక్కడకు వెళ్ళి, నిర్మాణంలోని మెలకువలను ప్రత్యక్షంగా అధ్యయనం చేసే అవకాశం హిమాంశు రాయ్‌కీ, ఆయన భార్య దేవికా రాణికీ దక్కింది. ఆ జంట సినిమా జీవితానికి భవిష్యత్తులో అది ఓ అద్భుతమైన అనుభవంగా పనికొచ్చింది. అయితే, అదే సమయంలో జర్మనీలో నాజీలు అధికారంలోకి రావడంతో ఆ అనుభవానికి అర్ధంతరంగా తెర పడింది.

హిందీ - ఇంగ్లీషుల్లో తొలి టాకీ

'బాంబే టాకీస్'ను నెలకొల్పడం కోసం భారత్‌కు తిరిగి రావడానికి ముందు హిమాంశు రాయ్ మరో చిత్రాన్ని నిర్మించారు. దాని పేరే - 'కర్మ' (1933). హిందీ, ఇంగ్లీషు భాషల్లో తయారైన తొలి భారతీయ టాకీ అది. ఆ చిత్రం షూటింగ్ మొత్తం లండన్‌లోని స్టోల్ స్టూడియోస్‌లో జరిగింది. లొకేషన్ షూటింగ్ మాత్రం భారతదేశంలో చేశారు. ఆ చిత్రంలో దేవికారాణి, హిమాంశు రాయ్, బుర్ద్వాన్ మహారాణి సుధారాణి నటించారు. నటిగా దేవికా రాణికి అదే తొలి చిత్రం.

ఐరోపాలోని కొన్ని ప్రముఖ స్టూడియోలతో ఈ చిత్రాల సహ - నిర్మాణ సమయంలో హిమాంశు రాయ్ ఎంతో విస్తారమైన అనుభవం గడించారు. దాంతో, 1934లో స్వయంగా 'బాంబే టాకీస్'ను స్థాపించినప్పుడు ఆయన దృఢంగా నిలబడగలగడానికి అవి తోడ్పడ్డాయి. బాంబే టాకీస్‌ను ఉమ్మడి స్టాక్ కంపెనీగా ఆయన ప్రారంభించారు. 'వెస్టన్ స్టూడియోస్' లాగానే ఈ సంస్థలోని డైరెక్టర్ల బోర్డులో కూడా ఎంతోమంది ప్రముఖులు, ప్రసిద్ధ వ్యాపారవేత్తలు ఉండేవారు. భారతదేశంలో చిత్ర నిర్మాణాన్ని అనారోగ్యకరమైన పెను జూదంగా భావిస్తూ, భారీ పెట్టుబడికి తగని రంగంగా పరిగణిస్తున్న ఆ రోజుల్లో ప్రముఖ వ్యాపారవేత్తలు సభ్యులుగా నిలవడం చెప్పుకోదగ్గ విషయమే.

నిజానికి, 1930ల నాటి తీవ్ర ఆర్థిక మాంద్యాన్ని తట్టుకోలేక చాలామంది సినీ వ్యాపారాన్ని వదిలేశారు. ఆసియా ఉపఖండంలోనే అతి పెద్ద గొలుసుకట్టు చలనచిత్ర పంపిణీ సంస్థ అయిన 'మదన్ థియేటర్స్' సైతం అంతర్జాతీయ షేర్ విపణి వాల్‌స్ట్రీట్ కుప్పకూలిపోవడంతో, 1929లో దివాళా తీసింది. కానీ, హిమాంశు రాయ్ మాత్రం తన వ్యాపారదక్షతతో నిలదొక్కుకున్నారు. సహ - నిర్మాణాల విషయంలో ఆయన అనుభవం, సినిమాలకు జాతీయ మార్కెట్ విషయంలో ఆయన ఆలోచనా ధోరణి సమకాలీనులకు భిన్నంగా ఉండేది. ఐరోపా మార్కెట్‌లోకి ప్రవేశించడం వల్ల క్లిష్టమైన పరిస్థితులను తట్టుకోవడమే కాక, 'బాంబే టాకీస్' ఏర్పాటుకు సైతం హిమాంశు రాయ్ పునాది వేయగలిగారు.

భారతీయులకు శిక్షణతో 'బాంబే టాకీస్' చరిత్ర

బొంబాయి శివార్లలో ప్రశాంతంగా ఉండే చిన్న గ్రామమైన మలాడ్ గ్రామంలో హిమాంశు రాయ్ 'బాంబే టాకీస్' పేర చక్కటి స్టూడియోను నెలకొల్పారు. మునుపటి చిత్రాల సందర్భంగా తాను కలసి పని చేసిన జర్మన్ సహ సినీ సాంకేతిక నిపుణుల సహాయం కూడా చిత్ర నిర్మాణ లేబొరేటరీని నిర్వహించడం కోసం హిమాంశు రాయ్ తీసుకున్నారు. భారతీయ సాంకేతిక నిపుణులకు శిక్షణనివ్వాలనే స్పష్టమైన అవగాహన కుదుర్చుకొని, వీరందరినీ ఇక్కడకు తీసుకురావడం జరిగింది. వచ్చినవాళ్ళు ఆ పని చేశారు. దేశం నలుమూలలకు చెందిన ప్రతిభావంతులైన యువ పట్టభద్రులకు ఎంతోమందికి శిక్షణనిచ్చారు. అలా శిక్షణ పొందినవారిలో కె.ఎ. అబ్బాస్, అశోక్ కుమార్ గంగూలీ తదితరులు చాలా మందే ఉన్నారు. ఇక, లండన్‌లోని ప్రసిద్ధ రాయల్ అకాడమీ ఆఫ్ డ్రమటిక్ ఆర్ట్‌లో చదువుకొని, ఆ తరువాత మ్యాక్స్ రీన్‌హార్డ్ వద్ద పాఠాలు నేర్చుకున్న అనుభవం ఉన్న దేవికా రాణి, కొత్త వారికి సహజ శైలి నటనలో తర్ఫీదునిచ్చారు.

'బాంబే టాకీస్' వారి చలనచిత్ర రూపకల్పనలోని ఇతర అంశాల్లో సైతం ఇదే విధమైన సహజత్వం చోటుచేసుకుంది. బాంబే టాకీస్ సాధించిన ప్రధాన విజయాల్లో ఒకటి - ఎంతో సరళమైన హిందుస్తానీ భాషను ప్రవేశపెట్టడం! వారి తొలి చిత్రం - 'జవానీ కీ హవా' (1935). దేవికా రాణి, నజ్‌ముల్ హుస్సేన్ నటించిన ఈ చిత్రాన్ని 'రొమాంటిక్ క్రైమ్ థ్రిల్లర్' అభివర్ణించారు. అపరాధి ఎవరనే అంశం చుట్టూ తిరిగే ఈ నాటకీయ చిత్రం ఆదరణ చూరగొంది. హిమాంశు రాయ్ భారతీయ చలనచిత్ర రంగానికి కొత్తదైన మరో పంథా తొక్కారు. సుదీర్ఘమైన ఒకే కథతో చలనచిత్రం రూపొందించే బదులు, రెండు చిన్న చిన్న కథలతో 'మమత', 'ఆల్వేస్ టెల్ యువర్ వైఫ్' ('మియా బీవీ') (1935) అనే రెండు వేర్వేరు చిన్న చిత్రాలు తీశారు. ఈ రెండు చిత్రాలనూ ఎంతో నైపుణ్యంతో రూపొందించినప్పటికీ, మూడు గంటల వ్యవధితో సాగే సుదీర్ఘమైన సినిమాలకు అలవాటు పడ్డ భారతీయ ప్రేక్షకులను ఈ చిన్న చిత్రాలు ఆకట్టుకోలేకపోయాయి.



'ఎ త్రో ఆఫ్ డైస్'

అస్పృశ్యతపై ధ్వజమెత్తిన 'అఛూత్ కన్య', 'జీవన్ నయ్యా' హిట్టవడంతో, 'సంస్కరణవాదంతో కూడిన సాంఘిక కథాంశాలే మేల'ని హిమాంశు రాయ్ గుర్తించారు. 'బాంబే టాకీస్' తదుపరి చిత్రం 'అఛూత్ కన్య' (1936) ఆ సంస్థ కీర్తి కిరీటంలో కలికితురాయి. భారతదేశంలోని కుల వ్యవస్థలో ఉన్న క్రూరత్వాన్ని ఆ చిత్రం కళ్ళకు కట్టింది. విప్లవాత్మకమైన ఆ చిత్ర కథాంశం వివాదం సృష్టించడమే కాక, విజయాన్ని కూడా అందించింది. ఆ సినిమాను కేవలం 8 వారాల్లో నిర్మించారు. దానికి అయిన ఖర్చు కూడా లక్ష రూపాయలకు లోపలే అని పరిశీలకుల భోగట్టా. అలాంటి చిత్రం బాక్సాఫీసు వద్ద చరిత్ర సృష్టించింది.

రెండో ప్రపంచ యుద్ధం 'బాంబే టాకీస్'పై దుష్ప్రభావం చూపింది. ఆ సంస్థకు చెందిన జర్మన్ సాంకేతిక నిపుణులందరినీ బ్రిటీషు వారు తమ దగ్గర శిబిరాల్లో బందీలుగా ఉంచేశారు. అప్పట్లో హిమాంశు రాయ్ చిత్ర నిర్మాణంలోని ప్రతి విభాగాన్ని స్వయంగా పర్యవేక్షించేవారు. అలా మితిమీరి పనిచేయడం హిమాంశు రాయ్ ఆరోగ్యంపై ప్రభావం చూపింది. దాంతో, ఓ గొప్ప సంస్థను నెలకొల్పిన అయిదేళ్ళకాలానికే, పదిహేను చిత్రాల నిర్మాణంతోనే నరాలు దెబ్బతిని, 1940 మే 19న హిమాంశు రాయ్ మరణించారు. మరణించేనాటికి ఆయన వయస్సు 48 ఏళ్ళే! ఆయన మరణం తరువాత 1945 వరకు దేవికా రాణి పర్యవేక్షణలో 'బాంబే టాకీస్' పతాకంపై చిత్ర నిర్మాణం సాగింది. కానీ, ఆ పైన ఆమె స్టూడియోను వదిలేసి, రష్యన్ చిత్రకారుడు డాక్టర్ స్వెతొస్లావ్ రోరిచ్‌ను వివాహం చేసుకొన్నారు. మరికొన్నేళ్ళు 'బాంబే టాకీస్' పైన చిత్ర నిర్మాణాలు జరిగినా, ఆఖరి చిత్రం 'బాద్‌బాన్' (1954)తో ఆ సంస్థ కనుమరుగైంది.

ఏమైనా, భారతీయ చలనచిత్ర చరిత్రలో హిమాంశు రాయ్‌ది ప్రత్యేక అధ్యాయం. భారతీయ చలనచిత్రాల మార్కెట్‌ను విస్తృతమైన దృష్టి కోణంతో చూసిన ఔత్సాహికుడిగా ఆయన గుర్తుండిపోతారు. ప్రసిద్ధ విదేశీ చిత్ర నిర్మాణ సంస్థలతో కలసి కో-ప్రొడక్షన్స్‌గా భారతీయ చిత్రాలు తయారవుతున్న ఈనాటి ఆలోచనకు మూకీల రోజుల్లోనే ఆయన ఆద్యుడు. అదే ఆయనను చిరస్మరణీయుణ్ణి చేసింది.

★



నవ్వుల్ - పువ్వుల్

అర కోటి చాలా

హరి: కోటీశ్వరుడు కావడం ఎలా? అన్న పుస్తకం ఇస్తావా? చదువుకొని ఇస్తాను.

గిరి: దాన్దేముంది! తీసుకో...

హరి: ఏంటిది...ఇందులో సగం పేజీలే వున్నాయి. అంటే సగం కోటీశ్వరుడైతే చాలనుకుంటున్నావా?

తేనె తుట్టెలో...

భువన్: తేనెటీగలు డబ్బులెక్కడ దాచుకుంటాయి?

యువన్: ఇంకెక్కడా! తేనె తుట్టెలో.

దాంపత్యం

అతిథి: మీరు 45 ఏళ్లగా 11మంది పిల్లలు, 22 మంది మనవలు,మనవరాళ్లతో సుఖసంసారం చేస్తున్నారుకదా. దాంపత్య రహస్యం ఏంటి?

భర్త: ఏంలేదు. ఎవరైతే ముందుగా ఇంట్లోంచి వెళ్లిపోవాలనుకుంటారో వాళ్లు, పిల్లలందర్నీ తీసుకెళ్లాలని మేం ఒకరికొకరం మాట ఇచ్చిపుచ్చుకున్నాం. అంతే.

పాఠాలు

(యాభయ్యేళ్ల కిందట పెళ్లిళ్లు చేసుకొని అత్తగారిళ్లకు వెళ్లిన ఇద్దరు మహిళలు ఒకనాడు కలుసుకుంటారు)



1వ మహిళ: ఏమే! యాభై ఏళ్ల వైవాహిక జీవితం నీకు ఏం నేర్పిందే?

2వ మహిళ: పెళ్లి అంత గొప్ప ఉపాధ్యాయుడు ఈ ప్రపంచంలోనే లేడు. నాకు సహనం, ఓర్పు, క్షమ, దయ, జాలి... వంటి ఉత్తమ గుణాలను నేర్పింది. మరి నీకో...

1వ మహిళ: నాకూ అంతే...

కలర్ టీవీ



తిమ్మయ్య: ఏవండీ మీ షాపులో కలర్ టీవీలున్నాయా!

యజమాని: వున్నాయి సార్.

తిమ్మయ్య: మరైతే ఆకుపచ్చ టీవీ ఇవ్వండి.

బ్లడ్ గ్రూప్

డాక్టర్: ఏవండీ! మీది, మీ ఆవిడది ఒకటే బ్లడ్ గ్రూప్.

భర్త: ఆ కాక చస్తుందా! పాతికేళ్లగా పీల్చుతోందిగా...

నవ్వండి ప్లీజ్

ఒకడు: ఏంట్రా! ఆ పెద్దాయన ఫొటోగ్రాఫర్‌ని పట్టుకొని అలా చెంప చెళ్లుమనిపించాడు?

రెండోవాడు: మరి! శవాన్ని పట్టుకొని స్మైల్ ప్లీజ్ అంటే కాలదా ఏంటీ?

వానొస్తే...

యజమాని: ఏంట్రా! సోమరిపోతూ...అలా కూర్చోకపోతే మొక్కలకు నీళ్లు పోయొచ్చుగా.

పనివాడు: బయట వానొస్తోందయ్యా...

యజమాని: అయితే ఏంటంట! గొడుగేసుకొని వెళ్లు!

ఖాళీ

తల్లి: ఏంట్రా! నోట్సంతా ఖాళీగా వుంది. టీచర్ ఇవాళ ఏం చెప్పలేదా?

పిల్లవాడు: చెప్పారమ్మా.

తల్లి: మరి రాసుకోలేదే!

పిల్లవాడు: రాశానే!

తల్లి: మరి కనిపించదేరా!

పిల్లవాడు: టీచర్ బోర్డు మీద డస్టర్‌తో చెరిపేయగానే నేను ఎరేజర్‌తో నోట్సు మీద రాసింది చెరిపేశాను.

నక్లెస్

భార్య: ఏవండీ...నాకు రాత్రి ఓ కల వచ్చిందండీ. వాలెంటైన్స్ డే సందర్భంగా మీరు నాకు నక్లెస్ బహూకరించారంట.

భర్త: అవునా...

(వాలంటైన్స్ డే రోజున... భర్త భార్యకు ఓ గిఫ్ట్ ప్యాకెట్ ఇస్తాడు)

భార్య: ఏముందండీ ఇందులో.. (అంటూ తెరిచి చూసి కెవ్వుమంటుంది)

భర్త: ఏంటే అలా కేక పెట్టావు... 'కలలకు అర్థాలు...పరమార్థాలు' అన్న ఈ పుస్తకం చదివితే ఇద్దరికీ మంచిదని తెచ్చాను.

జోక్స్ బాగా వేస్తారా? మరైతే ఆలస్యం ఎందుకు! కార్డు మీద రాసి పంపండి. పాఠకులను కడుపుబ్బ నవ్వించండి. మా చిరునామా:

స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్‌నెం.21/1, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాద్

కొత్త పుస్తకాలు

బానిస బంధనాల వెనక...

మామూలుగా సామాజిక నియమాలని, నైతిక విలువలని, సదాచారాలని, మత విధానాలని, శాస్త్రాలని పరిగణించే అనేక విశ్వాసాలు మన చుట్టూ వున్నాయి. అయితే వీటన్నిటినీ 'స్త్రీ ఎందుకు బానిసయింది?' అన్న చిరు పొత్తం తుత్తునియలు చేస్తుంది. వాటికి పూర్తి విరుద్ధమైన విషయాలను ప్రతిపాదిస్తుంది. మొత్తం పది అధ్యాయాల్లో పది అంశాలను సూటిగా, స్పష్టంగా ప్రస్తావించారు రచయిత పెరియార్ ఈవేరా రామస్వామి నాయకర్. మొదటి అధ్యాయంలో 'శీలం-పాతివ్రత్యం' గురించి మన సమాజంలో వున్న నియమాలపై చర్చించారు. శీలం, పాతివ్రత్యం అనేవి కేవలం మహిళలకే వర్తించవని వాటిని స్త్రీపురుషులిరువురికి సమానంగా అన్వయించాలని చెప్పారు. ఇక రెండో అధ్యాయం 'తమిళ ప్రాచీన మహాకవి తిరువళ్ళువర్-శీలం, పాతివ్రత్యం'. తిరువళ్ళువర్ రచించిన 'తిరుక్కురళ్'ను అనేక శతాబ్దాలుగా మహానీతిగ్రంథంగా గొప్ప పవిత్ర గ్రంథంగా భావించడాన్ని పెరియార్ ప్రశ్నిస్తాడు. ఏ రచయితకైనా అప్పటి కాలమాన పరిస్థితులననుసరించే తన భావాలను వ్యక్తీకరిస్తాడు. కనుక 2,500 ఏళ్ల కిందట జీవించిన తిరువళ్ళువర్ కూడా ఆనాటి తన సామాజిక నైతిక విలువలనే అభివ్యక్తీకరించాడు. అందుకే తిరువళ్ళువర్ చెప్పాడని ఈనాటికీ మనం ఆయన భావాలను మనం గుడ్డిగా స్వీకరించాల్సిన అవసరం లేదంటాడు. 3వ అధ్యాయంలో 'ప్రేమ' ఒకసారి ఒకరిలో అంకురిస్తే అది శాశ్వతంగా వుండిపోతుందనే మాటలు ఊహాగానాలేనంటాడు పెరియార్. పైగా ప్రేమ దైవికమనడాన్ని ఆయన అంగీకరించడు. ప్రేమ కూడా కోరిక మాత్రమేనని, అది ఆవిర్భవించనూ వచ్చు, అదృశ్యమైపోనూ వచ్చని చెప్పాడు. నాల్గవ అధ్యాయంలో పెళ్లి అనేది ఆడ, మగ తన జీవన సౌలభ్యం కోసం ఏర్పరచుకునే ఒడంబడిక మాత్రమేనని అందులో ఎలాంటి దైవత్వం లేదని చెప్తాడు. పైగా వారిద్దరికీ అనుకూలంగా లేకపోతే ఇద్దరూ ఇష్టపూర్వకంగా హాయిగా విడిపోవచ్చని కూడా ప్రతిపాదిస్తాడు. ఐదవ అధ్యాయంలో ఒక సారి పెళ్లి చేసుకున్న తర్వాత మరలా రెండవ వివాహం చేసుకోవాల్సిన అవసరమేర్పడితే దాన్ని నేరంగా, తప్పుగా భావించాల్సిన అవసరం లేదంటాడు. ఏ యే సందర్భాలలో మళ్లీ పెళ్లి చేసుకోవాల్సిన అవసరం వుంటుందో కూడా ఈ అధ్యాయంలో వివరించాడు. వ్యభిచారం అన్నమాట వినపడిందీ అంటే అందులో మహిళనే దోషిగా నిలబెడతారు. కానీ ఈ నేరాన్ని స్త్రీపురుషులిద్దరికీ సమానంగా అన్వయించకుండా మహిళలకు మాత్రమే దాన్ని కేటాయించడం ఎంత దుర్మార్గమైందో ఆరవ అధ్యాయంలో వివరిస్తాడు. వితంతువులు సమాజంలో అనేక అవమానాలకూ, ఛీత్కారాలకూ గురవుతుంటారు. అయితే ఏడవ అధ్యాయంలో వీరు కూడా పునర్వివాహం చేసుకొని మిగతా జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలంటాడు పెరియార్. స్త్రీలకు స్వేచ్ఛ లభించాలంటే వారు పురుషులకు బానిసలుగా వుండకూడదని పురుషులలాగే అన్ని రంగాల్లో గౌరవమర్యాదలతో విరాజిల్లాలని, తల్లిదండ్రుల ఆస్తిని కుమారులవలెనే కుమార్తెలు కూడా హక్కుగా పొందాలని ఎనిమిదవ అధ్యాయంలో చెప్తాడు. గర్భధారణ వల్ల మహిళలకు కలిగే కష్టాలు, నష్టాలు, బాధలు, కన్నీరును తొమ్మిదో అధ్యాయంలో వివరిస్తాడు. స్త్రీలు, పురుషులకన్నా ఏ విషయంలో తీసిపోరని వారిరువురూ సమానమేనని, ఈ విధమైన దృఢాభిప్రాయం ఏర్పరచుకుంటే మహిళలు బాగుపడతారని చివరి అధ్యాయంలో వివరిస్తాడు పెరియార్. ఈ పది అధ్యాయాల్లోను చరిత్రగతిలో మహిళలు ఎలా బానిసలయ్యారు? వారిని పురుషులు బానిసత్వంలోకి ఎలా నెట్టేశారు? వంటి విషయాలను వివరించి తాము ఆ బానిసత్వం నుంచి ఎలా బయటపడి స్వేచ్ఛా వాయువులు పీల్చొచ్చో కూడా వివరించారు రచయిత. ప్రతి ఒక్క మహిళ తప్పక చదవవలసిన పుస్తకమిది.

స్త్రీ ఎందుకు బానిసైంది?, పెరియార్ ఈవే రామస్వామి నాయకర్,

ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్, పేజీలు: 48, వెల: 20/-.

- కె.చరిత

నేరము శిక్ష



దాస్తోయేవ్‌స్కీ రచించిన 'క్రైం అండ్ పనిష్‌మెంట్' రష్యన్ భాషలో చాలా ప్రసిద్ధి చెందిన నవల. ఒక సైకలాజికల్ థ్రిల్లర్. రష్యన్ సాహిత్య పత్రిక 'ది రష్యన్ మెసెంజర్'లో 1866లో జనవరి నుండి డిసెంబర్ వరకూ సీరియల్ నవలగా వచ్చింది. రాడికలిజం యొక్క ఐడియలిజం రచయిత ఈ నవలలో చూపించాడు. నవలలో ప్రధానపాత్ర రాస్కోల్నికోవ్ అనే యువకుడు. ఇతను సెంట్ పీటర్స్ బర్గ్ మాజీ విద్యార్థి. రోడియన్ రాస్కోల్నికోవ్ ఒంటరితనం, న్యూనతాధోరణి సామాజికంగా, నైతికంగా అతను ఎదుర్కొన్న ఘర్షణలకు ప్రతిబింబం ఈ నవల. తిండి కోసం, డబ్బు కోసం అతను తొలుత పడిన కటకట స్నేహితుడు రజామిహిన్ ఆదుకోబోయినా అతన్ని పట్టించుకోకపోవడం, వడ్డీవ్యాపారి అయిన ఒక స్త్రీని డబ్బుకోసం చంపేందుకు ప్రణాళిక వేసి అమలు పరచడం, నేరం చేసినా ఆ డబ్బుతో మంచి పనులు చేయవచ్చనే స్వీయ సమర్థనలు, తన చర్యలను నెపోలియన్ బోనపార్టీతో పోల్చుకోవడం, తనను తాను గొప్పమనిషిగా భావించుకుంటూనే తన నేరాన్ని సమర్థింపజేసుకోవడం, దయాళువు, త్యాగశీలి అయిన వేశ్యయువతి సోనియా ముందు తన నేరాన్ని అంగీకరించడం, అలాగే పాన్‌బ్రోకర్ చెల్లెలయిన విజూవిటాను కూడా ఆమె మంచిదే అయినా తను చంపేయడం గురించి, ఆ ఇద్దరు స్త్రీల హత్య గురించి పరిశోధన చేస్తున్న పెట్రోవిచ్ ముందు వెల్లడి చేయడం, నవలంతా ఉత్కంఠభరితంగా సాగుతుంది. బుద్ధి కుదురుగా వుండని ఒక వ్యక్తి సామాజికంగా ఒంటరిగా వుండే వ్యక్తి నైతికత గురించి ఎలా ఘర్షణకు లోనయ్యేదీ, మంచిచెడులు మధ్య ఎలా అతలాకుతలమయ్యేది అద్భుతంగా చిత్రింపబడిన రచన ఇది. ఈ నవలలో రాస్కోల్నికోవ్ చెల్లెలు, తల్లి పాత్రలు కూడా సహజంగా వున్నాయి. రాస్కోల్నికోవ్, సోఫియాల నూతన జీవిత స్ఫురణతో నవల ముగుస్తుంది. కథానాయకుడి సైకలాజికల్ జీవిత గమనాన్ని అత్యంత ప్రతిభావంతంగా రచయిత తీర్చిదిద్దడం వల్లే ఈ నవల చాలా ప్రఖ్యాతి చెందింది. 'నేరము-శిక్ష' పేరుతో తెలుగులోకి శివం ఈ నవలను అనువదించారు. రాస్కోల్నికోవ్ మానసిక ఘర్షణలను పాఠకుడు అందిపుచ్చుకునేలా అనువాదం కృతకంగా లేక సహజంగా సాగడం చాలా ముఖ్యం. చదవదగిన మంచి పుస్తకం 'నేరము-శిక్ష'.

నేరము - శిక్ష, దాస్తోయేవ్‌స్కీ క్రైం అండ్ పనిష్‌మెంట్ నవలకు

తెలుగు అనువాదం: శివం, వెల : 190/-. ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్‌హౌస్, విజ్ఞానభవన్ 41435, బ్యాంక్‌స్ట్రీట్, హైదరాబాద్1.

- సుధామ

ఉదయగిరి ఊసులు

ఎటు చూసినా పచ్చని అడవులు... చల్లని వాతావరణం... నల్లమల అడవితల్లి సొంతం. వీటన్నింటి మధ్య ప్రకృతి వొడిలో రంజిల్లే ముద్దు పాపాయిలా అనిపిస్తుంది ఉదయగిరి పట్టణం. అద్భుత శిల్ప సౌందర్యంతో, నిత్య పూజార్చనలతో కళకళ లాడిన ఆలయాలు, గాలిగోపురాలపై నగిషీలు ఆనాటి హిందూ శిల్పకళా సంప్రదాయ రీతులను సజీవంగా కళ్లకు కడతాయి. పర్యాటకుల హృదయాలను పరవశింప జేస్తాయి. అక్కడ నిర్మించిన మసీదులు, దేవాలయాలు హిందూ ముస్లిం రాజులు, నవాబుల పరమత సహనానికి చిహ్నాలు. "ఓం సహనావతు, సహనౌ భునక్తు సహే..., అల్లాహో అక్బర్ - అల్లాహో అక్బర్ లా ఇలాహ ఇల్లిల్లా:" వంటి మాటలు ఉదయగిరి కోనల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి.

- ఈతకోట సుబ్బారావు

శ్రీకృష్ణ దేవరాయల కాలంలో రత్నాలను రాశులుగా పోసి నడివీధుల్లో విక్రయించారంటారు. వారు పట్టాభిషిక్తుడై ఐదు వందల సంవత్సరాలైన నేపథ్యంలో, నెల్లూరు జిల్లా ఉదయగిరిలో రాష్ట్ర ప్రభుత్వం పంచశతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా నెల్లూరు సీమతో రాయల అనుబంధం, విజయనగర సామ్రాజ్య విస్తరణకు ముఖ ద్వారమైన ఉదయగిరి కోట చరిత్రను ఒక్కసారి మననం చేసుకుందాం.

వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉన్న శత్రు దుర్భేధ్యమైన దుర్గం ఉదయగిరి. నెల్లూరుకు వాయవ్య దిశగా సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉంది. 3261 అడుగుల ఎత్తైన ఈ కోట 'గోల్కొండ' కోటని పోలి ఉంది. దీని ప్రాబల్యం కోసం అనేకమంది రాజులు క్రీ.శ. ఎనిమిదో శతాబ్ది నుండే యుద్ధాలు సాగించారు. పల్లవులు, చోళులు, రెడ్డి రాజులు, విజయనగర ప్రభువులు, నవాబులు, ఢిల్లీ సుల్తానులు చివరకు ఆంగ్లేయులు సైతం ఉదయగిరిని పాలించిన వారిలో ఉన్నారు.

పదో శతాబ్దానికి పూర్వం ఉదయగిరి దుర్గం బోయల రాజ్యంగా ఉండేది. కొందరు ఆటవికులు ఉదయగిరికి దగ్గర్లో ఉన్న పల్లెలపై దండెత్తి బీభత్సం సృష్టించారట. క్రీ.శ.930లో తూర్పు చాళుక్య చక్రవర్తి విజయాదిత్యుని సేనాని పాండ్రంగుడు బోయల్ని ఎదిరించాడని, అడవులు నరికి సేద్యం చేయించారని చరిత్ర చెబుతుంది. ఈ దుర్గం ఎవరి పాలనలో ఎప్పుడు నిర్మించబడిందనే సాక్ష్యాధారాలు చరిత్రలో ఎక్కడా స్పష్టంగా లేవు. కుమార సంభవ కర్త నన్నెచోళుడు ఉదయగిరిని పాలించిన కాలంలో కనిగిరి ఒక సామంత రాజ్యంగా ఉండేది. చోళరాజుల తర్వాత ఉదయగిరి ప్రాంతాన్ని పల్లవరాజులు పాలించారని 28-8-1102 నాటి జడదేవి శాసనం ద్వారా తెలుస్తుంది. నందివర్మ అమ్మరాజు అనే పల్లవరాజు కడప జిల్లా ప్రొద్దుటూరును రాజధానిగా చేసుకొని ఉదయగిరిని పాలించాడని, వెలనాటి చోళరాజు క్రీ.శ.1160లో నందివర్మను ఓడించి ఉదయగిరి దుర్గంపై తమ విజయ పతాకాన్ని ఎగురవేశాడని చరిత్ర. 1235లో ఈ ప్రాంతం కాకతీయ సామ్రాజ్యంలో విలీనమైందనడానికి ఆధారాలున్నాయి. గణపతి దేవ చక్రవర్తి ఈ దుర్గాన్ని కొంతకాలం పాలించారని కరీంనగర్ జిల్లా ఉప్పరపల్లె శాసనంలో లిఖించబడింది. విజయనగర సామ్రాజ్య వారసుడు బుక్కరాయలు కుమారుడు విరూపాక్షరాయలు, అతని సోదరుడు కంపరాయలు ఉదయగిరి దుర్గాన్ని స్వాధీన పరచుకున్నారు. క్రీ.శ1343 నాటికి కావలి, ఉదయగిరి ప్రాంతాలను హరిహరరాయలు జయించాడు. భాస్కర రాయలు దుర్గాధిపత్యం వహించాక పోరుమామిళ్ల వద్ద ఒక దేవాలయాన్ని కట్టించాడని అక్కడి శాసనాన్నిబట్టి తెలుస్తోంది. అప్పట్లో కడప మండలమంతా ఉదయగిరి ఏలుబడిలో ఉండేది. ఆయన తర్వాత రెండవ హరిహరరాయలు కొంతకాలం ఈ ప్రాంతాన్ని పాలించి ఉదయగిరిని దరిశి వరకు విస్తరింపచేశాడు. క్రీ.శ 1382లో దేవరాయలు ఉదయగిరి పాలకునిగా నియమితులయ్యారు. క్రీ.శ.1390లో ఉదయగిరిపై వెలమలు, మహమ్మదీయులు కలిసి దండయాత్ర చేశారు. దేవరాయలు ఆ దాడిని తిప్పికొట్టాడు. క్రీ.శ 1404లో కందుకూరు దుర్గాధిపతి శ్రీగిరిరెడ్డి స్వాధీన పరుచుకొన్నాడని, గజపతులు ఉదయగిరిని జయించే వరకు వల్లభదేవుడు పాలించాడని, క్రీ.శ 1471-1488 మధ్య కాలంలో ఈ దుర్గం విజయనగర రాజుల ఆధీనంలోనే ఉండేదని చరిత్ర

ఆధారాలు చెబుతున్నాయి. సాళువ నరసింహరాయలు దుర్గాధిపత్యం వహిస్తుండగా క్రీ.శ 1488లో పురుషోత్తమ గజపతి దండెత్తి రాయలును ఓడించి ఉదయగిరి కోటలోనే బంధించాడని, రాయలు గజపతితో సంధి చేసుకొని కోట నుండి బయట పడ్డాడని కథనం. ఉదయగిరిలో గజపతుల పాలన బసవరాజుతో ప్రారంభమయ్యింది. గజపతి ఉదయగిరి దుర్గాన్ని బసవరాజుకే అప్పగించినట్లు క్రీ.శ 1509 నాటి నరసరాజు శాసనం వలన నిర్ధారణ అయింది.

శత్రు దుర్భేధ్యం ఉదయగిరి దుర్గం

దక్షిణ భారతదేశాన్ని ఏలిన విజయనగర రాజుల కాలంలో ఉదయగిరి దుర్గం కీలకదుర్గంగా విరాజిల్లింది. ఉదయగిరి దుర్గం రాయల సామ్రాజ్య విస్తరణకు ముఖద్వారమైంది. ఈ దుర్గాన్ని సాధించటం ఎంతో ప్రతిష్టాకరమని ఆనాటి చక్రవర్తులు భావించేవారు. ఇందుకు కారణం ఈ దుర్గం శత్రుదుర్భేధ్యం కావటమే. క్రీ.శ.16వ శతాబ్దంలో ఉదయగిరి రాజ్యానికి ఈశాన్యంగా రెడ్డిరాజులు, వాయవ్యంగా మహమ్మదీయ రాజులు పాలిస్తుండేవారు. ఉదయగిరికి చంద్రగిరి, కొండవీడు, పశ్చిమాన పెనుగొండ రాజ్యాలు సరిహద్దులుగా వుండేవి. పెనుగొండ, చంద్రగిరి విజయనగర రాజుల ఆధీనంలో ఉండగా, మహమ్మదీయ, రెడ్డి రాజులకు సరిహద్దుల్లో ఉన్న ఉదయగిరి రాజ్యం కొరకరాని కొయ్యగా మారింది. ఉదయగిరిని జయిస్తేగాని ముందుకు వెళ్లలేని పరిస్థితి ఈ రెండు రాజ్యాల పాలకులకు ఎదురయ్యేది. ఉదయగిరి రాజ్యం ఆనాటి రాజులకు సింహస్వప్నమై నిలిచింది. విజయనగర రాజ్యానికి ఇది సింహద్వారమైంది. ఖడ్గ చాలనం, మల్లయుద్ధం, గుర్రపు స్వారీల్లో అఖండ ప్రతిభాపాటవాలు కలిగిన శ్రీకృష్ణ దేవరాయలకు ఈ రాజ్యం జయించేందుకు 18 నెలలు పట్టింది. యుద్ధానికి తానే స్వయంగా నేతృత్వం వహించి శత్రుసైన్యాలను ముందుకు నడిపారు. రాయలు శత్రుసైన్యాలను చెల్లాచెదురు చేయగల నేర్పరి. పలు యుద్ధాల్లో ముందుండి వ్యూహరచన చేసేవారు. రాయలు ప్రదర్శించిన నైపుణ్యత ఆయన విజయం సాధించడానికి కారణమయింది. అయితే ఉదయగిరి దుర్గం ముట్టడిలో ఎదురైన అవరోధాలను అధిగమించడంలో ఆయన చూపిన బుద్ధికుశలత అమోఘం. ఈ మార్గంలోని కొండలను దాటి బండరాళ్లను తొలగించుకొని రాయల సైన్యం ముందుకు సాగింది. రాయలు తన సైన్యాన్ని ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించారు. శత్రుసైన్యాలు బండరాళ్లు, ఫిరంగి గుళ్లతో ఎదురుదాడి చేసినా తన సైన్యాన్ని నిరుత్సాహపడనీయక విజయం అందుకోగలిగారు. క్రీ.శ.1513లో ఉదయగిరి దుర్గం కోసం 44 వేల కాల్బలం, 7 వేల అశ్వదళం, 315 గజబలంతో బయలుదేరారు. గుత్తి, గండికోటల మీదగా ఉదయగిరి రాజ్యంలోకి ప్రవేశించారు. ఈ రాజ్యానికి ప్రతాపరుద్ర గజపతుల ప్రతినిధి రహూత్తరాయలు దుర్గరక్షకుడిగా ఉన్నాడు. విజయనగర, కళింగ రాజ్యాల సరిహద్దులో ఉన్న ఉదయగిరిని వశపరచుకోవటం కష్టంగానే మారింది. ఉత్సాహపరిచి సైనికులను కోటగోడల మీదికి ఎగబాకించారు. శత్రుసైన్యం హాహాకారాలు చేస్తూ శరణువేడారు. గజపతులను మట్టి కరిపించి విజయబావుటాను ఉదయగిరి దుర్గంపై ఎగరేశారు. ఆరోజు క్రీ.శ.1514 జూన్ 9వ తేది. ఉదయగిరి విజయం రాయల చరిత్రలో ఒక మైలురాయి. ఈ దుర్గ విజయంతో రాయలు తన పూర్వ విజయనగర సామ్రాజ్యాన్ని పునరుద్ధరించారు. శ్రీకృష్ణదేవరాయలు ఉదయగిరి దుర్గ విజయాన్ని తను రాసిన "ఆముక్తమాల్యద"లో అభివర్ణించగా, చారిత్రక దృష్టికల నందితిమ్మన తన "పారిజాతాపహరణం"లోనూ, అల్లసాని పెద్దన "మనుచరిత్ర"లోనూ హృద్యంగా వర్ణించారు. పాశ్చాత్య చరిత్రకారులు సైతం కృష్ణదేవరాయలు ఉదయగిరి ముట్టడి 18 నెలలు సాగిందని పేర్కొన్నారు.

ప్రాచీన చరిత్ర కలిగిన ఉదయగిరి దుర్గాన్ని పల్లవుల నుంచి గోల్కొండ నవాబుల వరకు పరిపాలించారు. మరెందరో ఈ దుర్గంపై కన్నేసి యుద్ధాలు చేశారు. దానికంతటికి కారణం ఇది శత్రు దుర్భేద్యమైన కోట కావటమే. ఇప్పటికీ రాజప్రాసాదాలు, దర్వాజాలు, బురుజులు, కోటలు, పేటలు, రాజమహల్ ప్రాకారాలు కనువిందు చేస్తున్నాయి. గత వైభవాలకు చిహ్నాలుగా నేటికీ కనువిందు చేస్తున్నాయి. ఉదయగిరి పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ దుర్గముంది. మొదట మెట్ల దారి. ఆ దారి వెంట వెళ్లగలిగితే టప్పా వస్తుంది మరికొంత శ్రమించి ముందుకు వెళితే, మొదట కోట ముఖద్వారం వస్తుంది. ఇది గుర్రపునాడా ఆకారంలో ఉంది. ఇక్కడి నిర్మాణాలు అపూర్వ అనుభూతికి లోను చేస్తాయి. ముఖద్వారం దాటి ముందుకెళితే రాజమహల్ ప్రాంగణం కనిపిస్తుంది. ఎత్తయిన కొండపై సమతలంగా ఉన్న ఈ ప్రదేశంలో ఎనిమిది పటిష్టమైన కోట బురుజులు దర్శనమిస్తాయి. వీటిపైకి సైనికులు ఎక్కేందుకు మెట్లు అమర్చి ఉన్నాయి. అర్ధ వృత్తాకారంలో కొండపైభాగాన సైనికులు నిరంతరం పహారా కాసేవారు. వీటి పైనుంచి శత్రువులను ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లూ బురుజులపై ఉన్నాయి. వీటిని చూడగానే రాజ్యాలు, రాజరికాలు, వారి శౌర్యప్రతాపాలు ఒక్కసారిగా కళ్లముందు మెదులుతాయి. రాజ్‌మహల్ ఎత్తయిన కొండపై రెండంతస్తులతో నిర్మితమైంది. శత్రురాజుల బారినుండి తప్పించుకొనేందుకు ఇక్కడి నుండి రహస్యబాటలున్నాయి. రాజమహల్ ప్రాంగణంలో విశాలమైన బాటలు, బలిష్టమైన గోడ నేటికీ చెక్కుచెదరక ఉంది. సైనికుల స్థావరాలు, సిబ్బంది గృహాలు శిథిలమై మొండి గోడలు, పెంకులు కనిపిస్తాయి. అద్దాలమేడ కూడా శిథిలమైంది. రాజమహల్ ప్రాంతంలో ఏకాంత మసీదు, చిన్న మసీదు ప్రశాంత వాతావరణంలో ఉన్నాయి. నాలుగు మినార్లు, మూడు కమాన్లతో నాజూకైన నగిషీలతో మహమ్మదీయ శిల్పకళారీతి కనిపిస్తుంది. చిన్న మసీదు గొప్ప కళాత్మకంగా ఉంటుంది. ఆ గోడలో అరబిక్ శాసనం అమర్చి పెట్టారు. ఆ కొండల మీద తవ్విన బావులు ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. ఇంతటి ప్రాచీన కట్టడాన్ని చూసేందుకు ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారు. ★





అరబ్బుల ప్రజాస్వామ్య దాహం

ఈజిప్టు అనగానే మనకు గుర్తు వచ్చేది క్లియోపాత్రా, పిరమిడ్లు, నైలు నది, భయంకరమైన ఎడారి ! సహారా, లిబియా ఎడారులుగా పిలిచే ఈ ప్రాంతంలో సంభవించే ఇసుకతుపాను 30 మీటర్ల ఎత్తు వరకు ఉంటుంది. ఇప్పుడు అంతకంటే పెద్దదైన ప్రజాస్వామిక జన తుపానుకు నియంత హోస్నీ ముబారక్ ఏక్షణంలో అయినా కొట్టుకుపోయే స్థితిలో ఉన్నాడు.ఈ ఎడారులే ఈజిప్టు రాజులను పశ్చిమ దేశాల దండయాత్రలనుంచి కాపాడాయి.అయితే మూడు దశాబ్దాలుగా తమ రక్షణలో ఉన్న నియంతను తాజా ప్రజావిప్లవం నుంచి ఆ పశ్చిమ దేశాలే కాపాడలేక మరో కొత్త ముఖాన్ని ప్రతిష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఓ వైపు "మాకు రాయితీలు కాదు కావాల్సింది ముబారక్ [illegible]కోవటమే" అని జనం కొత్త సర్కార్ తాయిలాలను తిరస్కరించారు. మరో వైపు పదవి నుండి తప్పకునేందుకు నియంతకు వారం రోజులు గడువిచ్చినట్టు ముస్లిం బ్రదర్ హుడ్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఈజిప్టు పరిణామాలను ఈ వారం అట్టమీది కథలో పరిశీలిద్దాం.

- ఎం.కోటేశ్వరరావు

నైలు నదీతీరాన వెల్లివిరిసిన పురాతన నాగరికత ఉన్న దేశాలలో ఈజిప్టు ఒకటి. ఉత్తరాఫ్రికాలో మధ్యధరా సముద్ర ప్రాంత దేశాలలో పెద్దది. ఒక ప్రాంతమంతా సారవంతమైన నల్లనేలలు, మరో ప్రాంతం ఎర్రటి ఇసుక ఎడారులతో ఉంది. క్రీస్తు పూర్వం ఎనిమిదివేల సంవత్సరాల నుంచి చరిత్రకు ఎక్కింది. చారిత్రాత్మకమైన స్పింక్స్, గీజా పిరమిడ్లు నేటి ఆధునిక ఈజిప్టుకు మారుపేరుగా నిలిచినప్పటికీ వాటి నిర్మాణం క్రీస్తుపూర్వం 2700–2200 సంవత్సరాల మధ్య జరిగింది. అవి విహార కేంద్రాలుగా దేశంలో 12శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. క్రీస్తుపూర్వం 1070 సంవత్సరం నాటికి మధ్యధరా సముద్ర ప్రాంతంలో ఒక అంతర్జాతీయ శక్తిగా ఎదిగింది. దాంతో సహజంగానే దండయాత్రలకు గురైంది. లిబియన్లు, న్యూబియన్లు, అసిరియన్ల ఆక్రమణలను ఈజిప్షియన్లు తిప్పికొట్టారు. పర్షియన్లతో జరిగిన యుద్ధంలో 343 బిసిలో ఈజిప్టు రాజు ఓటమి పాలయ్యాడు. ఈజిప్టులో నేడు రాజధాని కైరో తరువాత పెద్ద పట్టణమైన అలెగ్జాండ్రియాను ఈజిప్టును ఆక్రమించిన అలెగ్జాండర్ నిర్మించాడు. అలెగ్జాండర్ మరణం తరువాత ప్రఖ్యాతిగాంచిన క్లియోపాత్రా పరిపాలన సాగింది. విషాదంగా ముగిసిన ఆమె మరణం తరువాత 30బిసిలో ఈజిప్టు రోమన్ సామ్రాజ్యంలో భాగమైంది. దాదాపు ఏడువందల సంవత్సరాల పాటు కొనసాగింది. క్రీస్తుశకం 639 తరువాత అరబ్బుల దండయాత్రలతో రోమన్ల శకం ముగిసింది. అప్పటివరకు క్రైస్తవ ఈజిప్టుగా ఉన్న దేశం ముస్లిం సున్నీ మతాన్ని కూడా స్వీకరించింది. ఖలీఫాలు నియమించిన పాలకుల పాలన మరో ఆరువందల సంవత్సరాల పాటు సాగింది. ఫతిమిద్‌ల పాలకులలో అయుబిద్ వంశస్తుల పాలన 1250లో అంతమైంది. మిలిటరీ నాయకుడు మాములుక్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. ఆ సమయంలోనే భారత్‌లో సహా మలయా, ఈస్టిండియా దీవులతో ఈజిప్టుకు సంబంధాలు ఏర్పడ్డాయి. వారి పాలన 1517 ఒట్టోమన్ టర్కుల దండయాత్ర వరకు సాగింది. ఒట్టోమన్‌ల పాలనలో ఈజిప్టు అనేక విధాలుగా అస్తవ్యస్థమైంది. తీవ్రమైన కరువులు వచ్చాయి. అలాంటివాటిలో 1784నాటి కరవులో దేశజనాభాలో ఆరోవంతు మంది మరణించారు. వ్యాపార వాణిజ్యాలన్నీ పోర్చుగీసువారి పరమయ్యాయి. ఈ సమయంలోనే ఫ్రెంచి నెపోలియన్ బోనపార్టే, బ్రిటీష్ వారు కూడా ఈజిప్టును ఆక్రమించుకొనేందుకు ప్రయత్నించారు. దేశంలో అరాచకం ఏర్పడింది. ఈ క్రమంలో 1805 నాటికి ఒట్టోమన్ సామ్రాజ్య సేనలో ఉన్న అల్బేనియన్ రెజిమెంట్ కమాండర్ మహమ్మద్ ఆలీ ఈజిప్టును తన అదుపులోకి తెచ్చుకున్నాడు. ఒట్టోమన్ సుల్తాన్ తన ప్రతినిధిగా ఆలీని గుర్తించాడు. వాస్తవానికి

ఈజిప్టు అటు ఫ్రెంచి, బ్రిటన్, ఒట్టోమన్ సామ్రాజ్యం నుంచి స్వతంత్ర దేశంగా అవతరించింది. 1952లో పతనమయ్యే వరకు మహమ్మద్ ఆలీ వారసులే పాలకులుగా ఉన్నారు. ఒకప్పుడు బ్రిటీష్ వారిని వ్యతిరేకించిన వారు చివరి రోజుల్లో వారి తొత్తులుగా మారారు. మహమ్మద్ ఆలీ సూడాన్, సిరియా, అరేబియా, అనటోలియాలోని కొన్ని ప్రాంతాలను ఆక్రమించాడు. అయితే టర్కీ కేంద్రంగా ఉన్న మొత్తం ఒట్టోమన్ సామ్రాజ్యానికే మహమ్మద్ ఆలీ ఎసరుపెడతాడనే భయంతో 1841 నాటికి ఐరోపా దేశాలు వత్తిడి తెచ్చి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలలో ఎక్కువ భాగాన్ని తిరిగి ఒట్టోమన్‌లకు అప్పగించారు. అయితే సూడాన్‌ను మాత్రం ఆలీకే అప్పగించారు. పశ్చిమ దేశాలతో కుదిరిన అవగాహనతో దేశాన్ని నవీకరించేందుకు పూనుకున్నాడు. పశ్చిమ దేశాలకు విద్యార్థులను పంపి పరిశ్రమలు, సాగునీటి కాలవల నిర్మాణం వంటి అంశాలను అధ్యయనం చేయించి అమలు జరిపాడు. పొడవు పింజ పత్తిని కూడా సాగు చేయించాడు.

'కుక్కలూ అవే గొలుసులూ అవే'

స్పెయిన్‌లో ఒక సామెత ఉంది. అదేమంటే 'కుక్కలవే గొలుసులే వేరు' అంటే అధికారంలో ఉన్న నియంతల్లో మార్పు లేకుండా రూపంలో మాత్రమే మార్పు అని అర్థం. కానీ ఈజిప్టులో ఆ సామెతను కూడా పశ్చిమ దేశాలు విస్మరించి 'కుక్కలూ అవే గొలుసులూ అవే' అన్నట్లుగా ముబారక్ పరంపరకు చెందిన సులేమాన్‌ను ప్రతిష్ఠించేందుకు చేస్తున్న యత్నాలపై ఒక పత్రిక వ్యాఖ్యానించింది. ముబారక్ తప్పుకోవాలని చెప్పిన అమెరికా ప్రతిపక్షాలు, పౌరుల అణచివేతలో కీలక పాత్రధారిగా ఉన్న సులేమాన్‌ను ఉపాధ్యక్ష స్థానంలో ప్రతిష్ఠింపచేయించింది. రాజ్యాంగంలో ఆ పదవిని పొందుపర్చి మూడు దశాబ్దాలవుతున్నా ఇంతవరకు ఒక్కరంటే ఒక్కరిని కూడా నియమించని ముబారక్ తొలిసారిగా సులేమాన్‌ను నియమించినపుడే అమెరికా నాటకం లోకానికి వెల్లడైంది.

నూతన ట్రేడ్ యూనియన్

ఇప్పటివరకు ఈజిప్టులో ప్రతిపక్షమైనా, అధికారపక్షమైనా ముబారక్ కనుసన్నలలో మెలిగేవారే బతికి బట్టకట్టారు. కార్మిక సంఘాలు కూడా అంతే. ముబారక్ ఉద్వాసన ఉద్యమం ప్రారంభమైన తరువాత జనవరి 30న అనేక యూనియన్ల ప్రతినిధులు సమావేశమై ఈజిప్షియన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండిపెండెంట్ యూనియన్స్ అనే కొత్త సంస్థను ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాఉద్యమంతో గొంతు కలిపి సాధారణ సమ్మెకు కూడా పిలుపునిచ్చారు. కనీస-గరిష్ఠ వేతనాల వ్యత్యాసం పదిరెట్లకు మించి ఉండరాదని, కార్మికులు గౌరవ ప్రదమైన జీవనం గడిపేందుకు అవసరమైన కనీస వేతనం కావాలని డిమాండ్ చేసింది.

విప్లవ మైదానంలో 30లక్షల మంది

ముబారక్ గద్దె దిగాలని కోరుతూ ఎనిమిదిన్నర కోట్ల జనాభాగల ఈజిప్టులో లక్షలాది మంది నిత్యం ప్రదర్శనలు జరుపుతున్నారు. వాటిలో రాజధాని కైరోలోని తహ్రిర్ స్క్వేర్(విప్లవ మైదానం)లో గరిష్ఠంగా 30లక్షల మంది ముక్త కంఠంతో "దిగిపో ముబారక్" అంటూ నినదించారు. అంతకు ముందు రోజే తాను మరోసారి ఎన్నికలలో పోటీ చేయనని ముబారక్ విన్నపాలకు దిగి మొత్తుకున్నప్పటికీ జనం అంగీకరించలేదు.

ఏప్రిల్ ఆరు యువజనోద్యమం

నిజానికి ఇది ఒక ఇంటర్నెట్ ఉద్యమం. అహమ్మద్ మహేర్, అహమ్మద్ సాలాహ్ అనే యువకులు దీనిని ప్రారంభించారు. ఎల్ మహల్లా ఎల్ కుబ్రా అనే పట్టణంలో 2008 ఏప్రిల్ ఆరున సమ్మె చేయాలని కార్మికులు నిర్ణయించారు. ఆరోజున నల్లబ్యాడ్జీలు ధరించి ఇళ్లలోనే ఉండాలని ఇంటర్నెట్ ద్వారా పలువురు సందేశాలు పంపారు. సమ్మె వార్తలను ఫేస్‌బుక్, ట్విటర్ ద్వారా ఒకరి నుంచి ఒకరికి అందచేశారు. బ్లాగుల్లో సమ్మె గురించి రాశారు. పోలీసుల గురించి హెచ్చరించారు. దీన్నే ఏప్రిల్ ఆరు యువజనోద్యమంగా పిలుస్తున్నారు. ఈ బృందం తాజా ఆందోళనల్లో ఇంటర్నెట్ ద్వారా ప్రముఖ పాత్ర వహించింది. పదిలక్షల మందితో ప్రదర్శనకు పిలుపు ఇచ్చిన వాటిలో ఇది ఒకటి. ఈ విధంగా ప్రారంభమైన ఈజిప్టు రాజకీయ ఫేస్‌బుక్ బృందంలో 2009 జనవరి నాటికి 70వేల మంది యువతీ యువకులు అనేక అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని న్యూయార్క్‌టైమ్స్ పత్రిక గుర్తించింది. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు గాను ప్రభుత్వం 2008లోనే మహేర్‌తో పాటు అనేక మందిని అరెస్టు చేసింది. పాలకులపై వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని నేరారోపణ చేసింది.

తన కోడి కూయకపోతే ఎలా తెల్లవారుతుందో చూస్తానని వెనకటికి ఒక ముసలమ్మ అనుకుందట. ముబారక్ కూడా ఇంటర్నెట్, సెల్‌ఫోన్లను బంద్ చేస్తే దేశం, బయటి వారికి కూడా సమాచారం అందకుండా చూడవచ్చని చావు తెలివిని ప్రదర్శించాడు. ఐదురోజుల పాటు నిలిపివేసినందున ఈజిప్టుకు తొమ్మిది కోట్ల డాలర్ల నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా. దీనికంటే ముబారక్ ఆదేశాల మేరకే తాము సేవలను నిలిపివేసినట్లు వోడాఫోన్ వంటి కంపెనీలు ప్రకటించి అసలు రంగును బయటపెట్టాయి.

మహిళల్లో నిరసన జ్వాల

'ఆగ్రహ ప్రదర్శన రోజు' నిరసన





ప్రదర్శనల్లో మహిళలు గణనీయంగా ఉండటం అసాధారణాంశం. మొత్తం ప్రదర్శకులలో 20 నుంచి 50శాతం వరకు ఉన్నట్లు అంచనాలు వెలువడ్డాయి. గతంలో పదిశాతం కంటే ఎక్కువ ఉన్న ఉదంతాలు లేవు. పురుషాధిక్య ఇస్లామిక్ సమాజంలో ఇదొక మంచి పరిణామం. అనేక కుటుంబాల నుంచి తల్లులూ కూతుళ్లు కలిసి పాల్గొన్న ఉదంతాలెన్నో ఉన్నాయి. పురుషులతో పాటు తమనూ అరెస్టు చేయమని ముందుకు వచ్చారు.

అశాంతి, ఆర్థిక పర్యవసానాలు

ఈజిప్టులో ఏర్పడిన అస్థిరత, అశాంతి ఆర్థికంగా ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తుందోనని కొందరు ఊహాగానాలు చేస్తున్నారు. నిజానికి 58లక్షల కోట్ల ప్రపంచ జిడిపిలో ఈజిప్టు వాటా కేవలం 215 బిలియన్ డాలర్లే. అందువలన ముబారక్ ఉన్నా ఊడినా పెద్దగా జరిగే నష్టం ఉండదు. పశ్చిమ దేశాల బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇచ్చిన రుణాలు కూడా 50బిలియన్ డాలర్లకు మించి లేనందున ఒక వేళ మొత్తం చెల్లించలేమని చేతులెత్తేసినా వాటికి వచ్చే ముప్పేమీ ఉండదు. జనవరి 30కి ముందు కైరో స్టాక్‌మార్కెట్ 16శాతం నష్టపోయింది. రోజుకు ప్రపంచంలో జరిగే 88 మిలియన్ పీపాల చమురు ఉత్పత్తిలో సూయజ్ కాలువ ద్వారా జరిగే 2-3మిలియన్ పీపాల ఉత్పత్తి ఆగిపోయినా ప్రపంచంపై పెద్దగా ప్రభావం ఉండదు. అయితే మరి చమురు ధరలెందుకు పెరిగాయంటే ఈజిప్టు తరహా ఆందోళనలు ఇతర అరబ్బు, ముస్లిం చమురు దేశాలకు కూడా పాకుతాయేమోనన్న భయమే కారణం. చమురు మార్కెట్‌లో 2008 జనవరిలో 92డాలర్లు ఉన్న ధర జూన్ నాటికి 140 డాలర్లకు చేరిన విషయం తెలిసినదే.

కీలకమైన సూయజ్ కాలువ

సామ్రాజ్యవాదులు ఈజిప్టును తమ అదుపులో ఉంచుకోవటం కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే కాదు, ఆర్థికాంశం కూడా ప్రధానమైనదే. నిరసన ప్రదర్శనలు ప్రారంభమైన వెంటనే పశ్చిమ దేశాల ఆయిల్, గ్యాస్, షిప్పింగ్ కంపెనీలు ముబారక్ పోతాడా ఉంటాడా అని కాదు, సూయజ్ కాలువ, ఇతర పైప్‌లైన్లతో తమ వాణిజ్య ప్రయోజనాలకు దెబ్బతగులుందా అని ఆందోళన పడ్డాయి. వాటికి బాసటగా పరిసరాలలో పెద్ద ఎత్తున సైన్యం మోహరించింది. ఈజిప్టులో చమురు పెద్దగా లేనప్పటికీ సూయజ్ కాలువ ద్వారా రోజుకు 20 చమురుపీపాలు, ఇతర ఉత్పత్తులు ఐరోపా, అమెరికా, ఆసియా దేశాలకు రవాణా అవుతాయి. ప్రపంచంలోని చమురు సరఫరాలలో 4.5శాతం, 14శాతం ఎల్‌పిజి, మూడుశాతం సహజవాయువు ఈ కాలువ, దాని పరిసరాలలోని పైప్‌లైన్ల ద్వారా రవాణా జరుగుతాయి. ఆందోళన సమయంలో ఇంతవరకు ఈ ప్రాంతంలో రవాణాకు ఎలాంటి ఆటంకం కలగలేదు. ఈ సందర్భంగా ఈ కాలవ గురించి చెప్పుకోవాలి.

చరిత్రలో కొన్ని పరిణామాలు అనూహ్య మార్పులకు దారితీస్తాయి. సూయజ్ కాలువ తవ్వక ముందు లండన్ నుంచి ముంబైకి బయలు దేరిన ఓడ ఆఫ్రికా ఖండపు గుడ్‌హోప్ అగ్రమును చుట్టి 19,800 కిలోమీటర్ల దూరం ప్రయాణించి రావాల్సి ఉండేది. కాలవ తవ్వకంతో ఈ దూరం 11,500 కిలోమీటర్లకు తగ్గింది. ఇదీ దీని ప్రాధాన్యత. క్రీస్తు పూర్వం 13వ శతాబ్దంలోనే ఈజిప్షియన్లు నైలు నదిని ఎర్రసముద్రంతో కలిపేందుకు ఒక కాలువను తవ్వారని, రెండువేల సంవత్సరాల పాటు ఉపయోగించినట్లు చరిత్ర చెబుతోంది. ఇదే ఐరోపావారిని క్రీస్తు శకం 1500 సంవత్సరం తరువాత సూయజ్ కాలువ తవ్వేందుకు ప్రేరణ కల్పించింది. ఈజిప్టులో పనిచేసిన ఫ్రెంచి రాయబారి ఫెర్డినాండ్ 1830 దశకంలో దీనికి రూపకల్పన చేశాడు. చివరకు 1854లో కాలువ తవ్వేందుకు ఈజిప్టు పాలకులనుంచి అనుమతి సంపాదించాడు. తవ్వకం పూర్తి అయిన తరువాత 99 సంవత్సరాలకు ఈజిప్టుకు దానిపై సర్వహక్కులు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నాడు. హిందూ మహాసముద్రం, ఉత్తర అట్లాంటిక్ సముద్రాల మధ్య ఉన్న మధ్యధరా సముద్రం,ఎర్రసముద్రం ద్వారా తవ్విన ఈ కాలువ నిర్మాణం 1869లో పూర్తైంది. సూయజ్ కంపెనీలో కొన్ని వాటాలను కొన్న ప్రభుత్వం ఇతరత్రా చేసిన అప్పులను తీర్చేందుకు తన వాటాను 1875లో బ్రిటన్‌కు విక్రయించింది. క్రమంగా ఈజిప్టు రాజును నామమాత్రం గావించిన ఫ్రెంచి,బ్రిటీష్ అధికారులు నిజమైన అధికారాన్ని చలాయించారు. ఈ పరిణామం ఈజిప్టులో జాతీయోద్యమానికి పునాదివేసింది.1882 జాతీయ భావాలున్న అహమ్మద్ ఉరాబీ ప్రధాని అయ్యాడు. బడ్జెట్‌పై పార్లమెంట్ అదుపుతో సహా అనేక సంస్కరణలు అమలు జరపాలని ప్రతిపాదించాడు. దీంతో తమ పట్టుకోసం ఫ్రెంచి, బ్రిటీష్ సేనలు నాటి రాజధాని అలెగ్జాండ్రియాపై దాడి చేశాయి. ఈజిప్టు సేనలను ఓడించి బ్రిటన్ రక్షణలో ఉండే ఈజిప్టుకు రాజు ఇస్మాయిల్ కుమారుడు తెఫిక్‌ను నామమాత్రాధికారాలతో గద్దెపై కూర్చోపెట్టారు. చివరకు 1914 తమ అంతర్భాగం గావించారు.

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత జాతీయవాదులు ఎన్నికలలో గెలిచి 1922 ఫిబ్రవరి 22న స్వాతంత్ర్య ప్రకటన చేశారు. నూతన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేశారు. రాజరికాన్ని కొనసాగించటం, బ్రిటీష్ వారి జోక్యాన్ని పూర్తిగా అరికట్టకపోవటంతో దేశంలో అస్థిరత ఏర్పడింది. దేశం నుంచి ఉపసంహరించుకున్నప్పటికీ సూయజ్‌కాలువ ప్రాంతంలో ఆంగ్ల సేనలు తిష్టవేసేందుకు వీలుకల్పిస్తూ 1936లో ఆంగ్లో-ఈజిప్టు ఒప్పందం జరిగింది. తరువాత రాజు మిలిటరీ సాయంతో 1952లో పార్లమెంట్‌ను రద్దు చేశాడు. చివరకు మిలిటరీ రాజును కూడా తొలగించి 1953 జూన్ 18 రిపబ్లిక్‌గా ప్రకటించింది. ఈ పరిణామాల వెనుక కీలకపాత్ర వహించిన మిలిటరీ జనరల్ గమాల్ అబ్దుల్ నాజర్ 1956లో అధ్యక్షుడయ్యారు. బ్రిటీష్ సేనలు సూయజ్ కాలువ ప్రాంతం నుంచి ఉపసంహరించుకున్న తరువాత అదే ఏడాది జూలై 26న సూయజ్ కాలువను జాతీయం చేశారు. ఈ కోపంతో వివిధ ప్రాజెక్టులకు సాయం అందిస్తామన్న అమెరికా వెనక్కు పోయింది. సూయజ్ కాలువకు అటూ ఇటూ పదికిలోమీటర్ల దూరంలో ఈజిప్టు సేనలు ఉండరాదని, అందుకు తిరస్కరిస్తే తాము దండయాత్ర చేస్తామని ప్రకటించి అక్టోబరు 31న బ్రిటీష్, ఫ్రెంచి సేనలు వైమానిక దాడులు జరిపాయి. తమ పౌరులను తరలించే సాకుతో అమెరికా మధ్యధరా సముద్రంలోకి సప్తమనౌకా దళాన్ని తరలించింది. మరోవైపు ఇజ్రాయెల్‌ను దాడికి పురికొల్పాయి. ఈ సమయంలో నవంబరు 5న సోవియట్ ఒక ప్రకటన చేస్తూ దాడులను ఆపకపోతే తాను సాయుధ జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ సమయంలో కెనడా విదేశాంగ మంత్రి పియర్సన్ జోక్యం చేసుకొని ఉద్రిక్తతలను నివారించేందుకు ఐరాస దళాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఆ దళాలు వచ్చిన తరువాత సూయజ్ సంక్షోభం సద్దుమణిగింది. ఆ తరువాతే నాజర్ అలీనోద్యమ ప్రారంభకులలో ఒకడిగా మారారు. ఆయన మరణించిన తరువాత అధికారానికి వచ్చిన అన్వర్ సాదత్ 1973లో జరిగిన అరబ్-ఇజ్రాయల్ యుద్ధ సమయంలో సోవియట్ వైపు నుంచి అమెరికా పక్షంలో చేరాడు. అప్పటి నుంచి మధ్యధరా సముద్ర ప్రాంతంలో అమెరికా ప్రాబల్యం పెరిగింది. 1981లో ఆయన హత్య తరువాత ఆ స్థానాన్ని ఆక్రమించిన జనరల్ హెూస్నీ ముబారక్ మరింతగా అమెరికా చంకనెక్కి చివరకు ఇజ్రాయెల్‌తో రాజీపడి పాలస్తీనా అరబ్బులకు అన్యాయం చేశాడు. అంతర్గతంగా నిజమైన ప్రతిపక్షాలను అణచివేశాడు

ముస్లిం బ్రదర్‌హుడ్

ఈజిప్టులో షరియత్ పాలనను ప్రవేశపెట్టాలనే శక్తులు "ముస్లిం బ్రదర్‌హుడ్" అనే సంస్థను 1928లోనే ఏర్పాటు చేశాయి. ఇవి మత ప్రాతిపదికన పశ్చిమ దేశాలను, యూదులను వ్యతిరేకించాయి. అయితే అబ్దుల్ నాజర్ నాయకత్వంలోని జాతీయవాద మిలిటరీ ఈ సంస్థను సమర్ధించలేదు. దాంతో అనేక సార్లు నాజర్‌పై ఈ శక్తులు హత్యాయత్నం చేశాయి. నాజర్ అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లిం బ్రదర్‌హుడ్ సంస్థను నాశనం చేశాడు. వేలాది మందిని ఎడారిలో ఏర్పాటు చేసిన నిర్బంధ శిబిరాలకు పంపాడు. దాని నాయకులు అనేక మంది అజ్ఞాతవాసంలోకి వెళ్లి మరింత కరడుగట్టిన మతశక్తులుగా తయారయ్యారు. నాజర్ మరణం తరువాత ఈ సంస్థ హింసామార్గం విడనాడుతున్నట్లు ప్రకటించటంతో రాజకీయ కార్య కలాపాలలో పాల్గొనేందుకు అనుమతిస్తున్నట్లు 1972లో అన్వర్‌సాదత్ ప్రకటించాడు. 1984 నుంచి ఎన్నికలలో పాల్గొన్నది.అయితే 1990 దశకం ప్రారంభంలోని ఈ సంస్థలోని తిరోగామి శక్తులు పూర్వపు వైఖరికి మళ్లాలని ప్రయత్నించాయి. 1996లో కొందరు సంస్కరణ వాదులు వారినుంచి విడగొట్టుకొని మధ్యేవాద పార్టీ పేరుతో రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు. లౌకికశక్తులతో కొంతమేరకు కలిసి పనిచేశారు.వీరే ఇప్పుడు ముబారక్ వ్యతిరేక ఉద్యమంలో కూడా పాల్గొంటున్నారు. తాము ప్రజాస్వామ్యానికే కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు. కొందరు మితవాదులు కూడా ఉద్యమంలో లేకపోలేదు. లౌకికవాది అయిన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ మాజీ అధిపతి మహమ్మద్ ఎల్‌బరాడీకి ఇప్పుడు మద్దతు ఇస్తున్నది. బరాదరి అధికారంలోకి రావటం అమెరికన్లకు సుతరామూ అంగీకారం కాదు. ఎందుకంటే ఇరాక్‌లో సద్దాం హుస్సేన్ సర్కార్ ఎలాంటి అణ్వాయుధాలు, ఇతర మారణాయుధాలు తయారు చేయటం లేదని 2003లో అణుశక్తి సంస్థ అధికారిగా ఆయన ప్రకటించారు. అయితే ఆ నివేదికను పక్కన పెట్టి తమ గూఢచార సమాచారం మేరకు ఆయుధాలు తయారు చేస్తున్నట్లు దబాయించిన అమెరికా ఇరాక్‌పై యుద్ధానికి పూనుకోవటంతో పాటు సద్దాం హుస్సేన్‌ను అంతమొందించిన అంశం తెలిసినదే. ఇరాన్ అణుకార్యక్రమం గురించి కూడా తాము చెప్పినట్లుగా వ్యవహరించలేదని బరాదరిపై అమెరికా కస్సుబుస్సులాడింది.

ప్రస్తుతం ఈజిప్టులో జరుగుతున్న ఉద్యమానికి లౌకికశక్తులు ప్రాతినిధ్యం వహించినా లేక ఇస్లామిక్ శక్తులది పైచేయి అయినా సామ్రాజ్యవాది అమెరికాకు ఎదురుదెబ్బే. అందుకే అది తన తొత్తు సులేమాన్ వైపు మొగ్గుతున్నది. దాని ఎత్తులు, జిత్తులను ఈజిప్షియన్లు సాగనిస్తారా? ★



కథ



మరీచిక

హిందీమూలం : ప్రేమ్‌చంద్

తెలుగు : డా॥దేవరాజు మహారాజు

ఇతరుల సంగతి నాకు తెలియదు. నాకు మాత్రం నిజమైన ఆనందం లభించేది స్వప్న జగత్తులోనే. అక్కడే నేను గుండె విప్పి నవ్వుతాను, గుండె విప్పి ఏడుస్తాను, గుండె విప్పి ఆడతాను, మనసారా పాడతాను. అదే నా రత్నఖచిత సౌధం. అక్కడే నా కోర్కెలు పుష్పిస్తాయి. అక్కడే నా యవ్వనం నాదవుతుంది. నా ఆలోచన నాదవుతుంది. నా కల నాదవుతుంది. నా స్వప్న జగత్తు ఈ బంధనాల ప్రపంచం కన్నా, ఈ చట్టాల ప్రపంచం కన్నా ఎన్నో రెట్లు ఉన్నతమైంది. ఎన్నో రెట్లు స్ఫూర్తిదాయకమైంది.

ఆ తన్మయత్వం, ఆ అనురాగం, ఆ ఉత్కృష్టత, ఆ జాగృతి... స్వప్నంలో ఎంతగానో అనుభూతి చెందుతాను. అది ఈ బయటి ప్రపంచంలో ఎక్కడుంది? విచారించదగ్గ విషయమేమిటంటే, అలాంటి కలలు ఎప్పుడో గాని రావు. జనం పొద్దున్నే నిద్ర లేవగానే మంచి వాళ్ల ముఖం చూడాలనుకుంటారు. కానీ నేను రాత్రిపూట మంచి వాళ్ల ముఖం చూసి నిద్రపోవాలనుకుంటాను.

నిన్న ఎవరి ముఖం చూసి పడుకున్నానో గుర్తులేదు. కాని నిద్ర పట్టడంతోనే స్వప్న సామ్రాజ్యంలోకి చేరుకున్నాను. చూద్దును కదా నా బాల్యం నాకు మళ్లీ తిరిగొచ్చింది. స్వేచ్ఛగా ఊపిరి పీలుస్తూ, ఉరుకులు పరుగులు తీస్తూ ఉన్నాను. మాతృ స్వరూపిణి అమ్మ, అనురాగమయి చెల్లి, బాల్య స్నేహితులు. అదే చిన్న ఇల్లు, అదే వేపచెట్టు... అన్నీ కళ్ల ముందుకు వచ్చాయి. అప్పటి ఆ ఆనంద జలపాతాన్ని ఏమని వర్ణించను? నా సంతోషాన్ని, ఉత్తేజాన్ని ఎలా వ్యక్తీకరించను? నా వల్లకాదు. అయితే ఒకటి మాత్రం నిజం. కొద్ది సేపటి క్రితం నేను ముసలివాణ్ణన్న సంగతి నాకు గుర్తుంది. ఉన్న ఫళాన నా శరీరంలో ఇన్ని మార్పులు రావడం నాకే ఆశ్చర్యంగా ఉంది. అయితే జీవితంలో ఒక మనిషిగా ఎదిగిన అన్ని దశలూ నాకు గుర్తున్నాయి. ఆశలు, నిరాశలు, ఆవేశాలు, కోరికలు, విజయాలు, అపజయాలు అన్నీ.

అయితే అవన్నీ ఈ స్వప్నంలోని బాల్యానికి ఆటంకం కాలేదు. అది ఒక చిత్రమైన దశ. నాలో అప్పుడు చంచలత్వం ఉంది. గాంభీర్యమూ ఉంది. అమాయకత్వం ఉంది. సంయమనమూ ఉంది. చెట్ల మీదికి ఎక్కుతున్నాను. కాని, జాగ్రత్తగా జారి పడకుండా ఎక్కుతున్నాను. కావాల్సిన వాటికోసం మారాం చేస్తున్నాను. కాని ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టి ఇల్లంతా ఒక్కటి చేయడం లేదు. ఆటల్లో గెంతుతున్నాను. కాని ఎక్కడా దెబ్బతగలకుండా జాగ్రత్త పడుతున్నాను. బడికి సక్రమంగా వెళ్తున్నాను. ఎవరితో అబద్ధాలు చెప్పడం లేదు. చిల్లర కొట్ల దగ్గర అడ్డమైనవన్నీ కొనుక్కుని తినడంలేదు. చేసే పని నుండి ధ్యాస మళ్లించడం లేదు. లోగడ చేసిన పొరపాట్లను గుర్తుతెచ్చుకుని, అవి మళ్లీ చెయ్యకుండా జాగ్రత్త పడుతున్నాను. జీవితంలో ఓటమికి మూల కారణాలు వెతుక్కోవడంలోనే కదా వివేకం ఉంది.

కేవలం స్వప్నానికే ఒక అద్వితీయమైన శక్తి ఉంది. నెలలు, సంవత్సరాలు, యుగాలు, కొన్ని క్షణాల్లోనే గడిచిపోతాయి. అసంభవాలన్నీ సంభవాలవుతాయి. అసాధ్యాలన్నీ సాధ్యాలవుతాయి.. కలలో నా స్కూలు చదువు ముగిసింది... కాలేజీకి వెళ్తున్నాను... అక్కడ కాలేజీ లేదు. విద్యార్థులెవరూ లేరు. తెలివి తక్కువ దద్దమ్మలంతా జీవితంలో నాకన్నా ముందుకు పోతున్నారు. అయినా ఇప్పుడు నేను ఎవరినీ ద్వేషించడం లేదు. దూషించడం లేదు. అధ్యాపకులు పాఠం చెబుతున్నప్పుడు, క్లాసులో నేను నవల చదువుతూ కూర్చున్న విషయం నాకు గుర్తుంది. ఆటలాడాల్సిన సమయంలో వీధుల్లో విహరించిన విషయమూ గుర్తుంది. ఒకసారి చేసిన తప్పులే మళ్లీ మళ్లీ ఎందుకు చేస్తాను? ఆ నవలలో ప్రేమ శూన్యమై పోయింది. ఆ వీధుల్లో విహారాలు కాలికి సంకెళ్లయ్యాయి. ఇప్పుడు నేను అన్ని పనులూ సమయానికి చేస్తాను. ఇప్పుడా ఫ్యాషన్ల పిచ్చిలేదు. టై కాలర్ కోసం, కొత్త సూట్లకోసం వెతుకులాట లేదు. విద్యార్థి దశలో ఉండే వింత వింత కోర్కెలూ లేవు. తిట్లు తినాల్సి వచ్చే దురలవాట్లూ లేవు. నాకున్న ఒక పూర్తి జీవితానుభవమే నన్నిప్పుడు రక్షిస్తూ ఉంది. హాకీ కర్ర నా కరవాలమైంది. ఫుట్‌బాలే ఒక బాంబయ్యింది. ఉరకలెత్తే ఉత్సాహంతో ఆట స్థలాన్ని దున్నేస్తున్నాను. సరైన వ్యాయామం చేయడం లేదని, మత్తుగా ఉంటున్నానని లోగడ అక్షింతలు పడడం నాకు గుర్తుంది కదా?

ఆ తర్వాత స్వప్న ప్రపంచంలో నా వివాహ ప్రయత్నాలు జరగడం చూశాను. ఇప్పటి దాకా జరుగుతూ వచ్చిన సంఘటనల్లో నన్ను నేను పునరుద్ధరించుకుంటున్నాను. బాల్యంలో, యవ్వనంలో లోగడ చేసిన తప్పులేవీ చేయకుండా జాగ్రత్త పడుతూ ఉన్నాను. విచారించాల్సిన అవసరం గానీ, భయపడాల్సిన పనిగానీ లేదు. కాని వివాహమనే ఒక మహత్తర సంఘటన ఎదురవగానే సమస్య జటిలమౌతున్నట్టుగా భావించాను. నా చైతన్యానికి ఎక్కడో పెద్ద గాయమైనట్టుగా తోచింది. నన్ను లేపి కుదేసినట్టు అయింది. బాల్యం, యవ్వనం తిరిగివస్తే ఫర్వాలేదు.

ఆనందంగా గడపొచ్చు. కానీ వివాహమనే సరికి అది జీవితాల బంధనం కదా? ఇద్దరు పెళ్లాలయిపోతారు కదా? చూడండిక ఎంత జటిలమైన సమస్యో ఇది. పెళ్లి చేసుకోవాలా వద్దా అనే ధర్మ సంకటంలో పడిపోయాను. ఈ వివాహ సమస్య నా పూర్వ స్మృతులను జాగృతం చేసింది. నేను ముందే ఈ వైతరిణిలో పడి కొట్టుకు పోతున్నానని చెబితే ఇక్కడ ఎవరైనా విశ్వసిస్తారా? అదీ గాక, తలమీద సవాలక్ష బరువులు, బాధ్యతలు మోసీమోసీ ఇప్పుడిదేమిటి? నాపై నాకే పూర్తిగా నమ్మకం కుదరడం లేదు. ఇంతకూ నేనెవర్నీ? ముసలివాణ్ణా? వయసువాణ్ణా? కల ఏది? వాస్తవమేది? తేల్చుకోలేక సతమతమై నేను ఛస్తూ ఉంటే, అదేమీ పట్టనట్లు మరోవైపు ఇంట్లోవాళ్లు నా పెళ్లికి కావల్సిన సామాన్లన్నీ తెచ్చిపడేస్తున్నారు. మా అమ్మకైతే కాళ్లు నేలమీద ఆనడం లేదు. ఈ ప్రపంచంలో సృష్టి మొదలైనప్పటి నుండి ఇప్పటి వరకు ఎవరికీ ఈ అదృష్టం కలగనట్టూ, తన కొడుకొక్కడికే మొదటిసారి కలగబోతున్నట్టు సంబరపడి పోతోంది. తాతగారు బజారుకు వెళ్లాలంటేనే చిటపటలాడేవారు. దుకాణాలన్నీ దోపిడీ కేంద్రాలని విమర్శించేవారు. ఇప్పుడు అమ్మ ఎంత చెబితే అంతే. బంగారు నగలంటేనే తేళ్లు, జెర్రులు పాకినట్లు ముఖం చిట్లించే ముసలాయన ముఖమంతా విప్పుకుని మరీ చూస్తున్నారు. అమ్మ రాణీ గారిలా హుకుం జారీ చేస్తుంటే, చిన్న చిన్న విషయాల దగ్గర రాణా ప్రతాప్‌సింగ్‌లా అచంచలంగా నిలబడగలిగే తాత గారికి ఇప్పుడేమైందో.. "తాన అంటే తందాన" అంటున్నారు. ఖుషీ ఖుషీగా దుకాణాల చల్లగాలులు పీలుస్తున్నారు. ఎన్ని సార్లు తిరిగొచ్చినా ఆయన ముఖమ్మీద విసుగే లేదు.

నా పరిస్థితి వేరుగా ఉంది. నా ఈ నూతన యవ్వనం వల్ల, మోసం జరగకూడదు. స్మృతిలో ఏ పొరలకిందో ఉన్న వైవాహిక జీవితపు అనుభవాలు నాకు బాగా



జ్ఞాపకం ఉన్నాయి. నాకు పిల్లా జల్లా అంతా ఉన్నారు. నాకు భార్య ఉంది. బావమరుదులు ఉన్నారు. ఇప్పుడీ నూతన వధువును తీసుకుని ఇంటికి వెళితే జనం ఏమంటారు? నాకు ముఖం ఎలా చెల్లుతుంది?యుక్త వయసులో ఉన్న కొడుకులు, ముసలితనంలో నేను చేసిన ఈ పాపపు పనికి నొచ్చుకోరా? ముప్పయ్యేళ్లుగా జీవిత భాగస్వామిగా ఉన్న ఆ మహా ఇల్లాలు ఏమై పోయేను? వీళ్లందరి ముందుకు అసలు నేను వెళ్లేదెట్లా? "నీ ఇంటికి ఎవడు పొమ్మన్నాడు? నవ వధువును తీసుకుని నీ అమ్మానాన్నల ఇంటికి పోరాదా?" అని దయచేసి ఎవరూ సలహా మాత్రం ఇవ్వకండి. అసలు నాకు ఇల్లూ వాకిలీ లేనే లేవు. కాని ఎందుకో జ్ఞాపకాల పొరల్లోంచి ఏవేవో కొంచెం కొంచెంగా గుర్తుకొస్తున్నాయి. తీపి గుర్తులు స్పష్టమౌతున్నాయి. అయినా స్వప్నంలో కాలం, సంఘటనలు ఒక వరుస క్రమంలో నడవాలని ఏమీ లేదు. ఎటునుండి ఎటైనా జరగవచ్చు. అదే స్వప్న న్యాయం! మిత్రులంతా ఎంత ఎగతాళి చేస్తారో అన్నది ఆలోచిస్తే నామీద నాకే కంపరం పుడుతోంది. "ఏం మహాశయా! పెద్ద పెద్ద సుద్దులు చెప్పి, బహు భార్యత్వాన్ని నిరసించి అందాల భరిణెను చంకన పెట్టుకొచ్చుకున్నావే?" అని ఎకసెక్కాలాడరూ?

ప్రాణసంకటంగా తయారైంది ఈ పెళ్లి విషయం! ఏం చెయ్యనూ? అమ్మను ఎలా ఒప్పించనూ? పిచ్చోణ్ణయిపోయ్యానని జనం నవ్వుతారేమో! ఇంతలో మంగళ వాయిద్యాలు మోగడం వినిపించింది. అమ్మ వచ్చి నాపై విరుచుకు పడింది. "ఇంత విచిత్రుడివేరా? అంతా పెళ్లి సంబరాల్లో ఊగిపోతూ ఉంటే నువ్వేంటి శోక దేవతలా ముఖం సాగదీసుకుని కూర్చున్నావు. ఇల్లంతా మంగళవాయిద్యాలతో పెళ్లి పాటలతో మారుమోగిపోతూ ఉంటే నీకు వినిపించడం లేదా? లే...లే... ఇంకా మేం బతికే ఉన్నాం నాయనా! మేం చచ్చాక ఏడుస్తూ కూర్చుందువు గాని.. లే..లే.. పెళ్లి ఊరేగింపుకు అంతా సిద్ధమైపోయింది. లేచి పెళ్లి బట్టలు కట్టుకో. త్వరగా తెములు...

నేనేమీ సమాధానం చెప్పలేకపోయ్యాను. అమ్మతో నేనేలా చెప్పేది? ఒకసారి ఆమే కదా నా పెళ్లి జరిపించింది. ఆమెకు తెలియదా? నేనిప్పుడు గుర్తు చెయ్యాలా? గత్యంతరం లేక వెళ్లి పెళ్లి బట్టలు వేసుకున్నాను. ఆడవాళ్లంతా నా చుట్టూ చేరి అలంకరణలు చేశారు. పాటలు పాడారు. మంగలికి ఇతరులకూ ఈనాములిచ్చారు. శాస్త్రోక్తంగా చెయ్యవలసిన పనులన్నీ పెద్దవాళ్లు చేయించారు. నేను పెళ్లి కొడుకునై పోయాను. బయటికి వెళ్లి పెళ్లి పల్లకిలో కూర్చున్నాను. బోయీలు పల్లకి ఎత్తారు. కొద్ది సేపట్లోనే నేను వధువు ఇంటి ముందున్నాను. పెళ్లి సందడికి ఏ మాత్రం కొదవలేదు. అదంతా ఏ పెళ్లిలోనైనా జరగాల్సిందే. కాని నాకు అదంతా ఇప్పుడు ఎంతో చిరాకు కలిగించింది. పాణిగ్రహణం చెయ్యాల్సిన ముహూర్తం ఆసన్నమైందని చెప్పారు. అప్పటి దాకా నోరు మూసుకుని చెయ్యమన్నదల్లా చేశాను. కాని పాణిగ్రహణం చేస్తే గొప్ప అనర్థం జరిగిపోతుందని నాకు తెలుసు. నేను పూర్తిగా మునిగిపోతాను. కాళ్లకు బంధనాలు పడతాయి. నేను ఎటూకాని వాణ్ణయిపోతాను. ఇక లాభంలేదు. నాకు పరీక్ష మొదలయింది. ఏదో ఒకటి చెయ్యాలి. ఈ యవ్వనం మరీచిక అయితే, బాధాతప్త హృదయంతో ఆ తరువాత కుళ్లి కుళ్లి ఏడ్వాలి. ఇప్పుడు.. నేను ఏం చెప్పి తప్పించుకోవాలి? ఏం వంక పెట్టాలి? నిజం చెప్పినా జనం నమ్మేట్లు లేరు. నన్నో పిచ్చివాడి కింద జమకట్టేట్టు ఉన్నారు... అయితే అయింది. మంచులా ఈ యవ్వనం క్షణంలో కరిగిపోతుంది. అప్పుడీ అమాయకురాలు నవ వధువు గతి ఏంకాను? ఉన్న ఫళాన లేచి పరుగెత్తాను. పెళ్లి బట్టల రెపరెపలు, పూలదండల అలంకరణలతో సహా వేగం పెంచుతూ పరుగెత్తాను. నా వెనక జనం పడ్డారు. ఆ నిమిషాన ఎలా పరుగెత్తానంటే, ఏదో భయంకర జంతువు నన్ను వేటాడుతున్నట్టు... వెనకా ముందూ చూడకుండా ప్రాణాలకు తెగించి పరుగెత్తాను. పరుగెత్తీ... పరుగెత్తీ చాలా దూరం వెళ్లాను. ఇంతలో నది ఒకటి అడ్డం వచ్చింది. ఆగకుండా పరుగెత్తి అందులో దూకాను. దాని నీలి కెరటాల బాహువుల్లో తల దాచుకున్నాను...

అంతే!! నిద్ర ఎగిరిపోయింది.

మేల్కొని చూద్దును కదా! పాత కుక్కి మంచంపై నిస్సహాయంగా పడిఉన్నాను. అయితే ఊపిరి ఇంకా ఆడుతూనే ఉంది. ★

వికాసం

ఎందుకు నవ్వారు?



విసుగు చెందని విక్రమార్కుడు ఎప్పటిలాగానే చెట్టుమీద నుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని నడవసాగాడు. 'రాజా...' అన్న గొంతు వినిపించింది. కాకపోతే కాస్త కొత్తగా వుంది.

మిమిక్రీ ప్రాక్టీసు చేస్తున్నావా భేతాళా అని అడిగాడు.

భేతాళ కాదు భేతాళి అని మరింత మార్దవంగా వినిపించింది.

అరే ఇన్నేళ్ల నా సర్వీసులో భేతాళుడే తప్ప నువ్వెప్పుడూ తగల్లేదే? బోలెడు ఆశ్చర్యంగా అడిగాడు విక్రమార్కుడు.

అదే కదా..చచ్చిన తర్వాత కూడా మా పరిస్థితి అలా వుంటుంది మరి! విక్రమార్క కథల్లో ఒక్కసారైనా ఆడశవం గురించి రాయలేదు భేతాళి నిష్ఠూరంగా అంది.

'నిజమే..' తప్పనిసరిగా తలూపాడు విక్రమార్కుడు.

'సరే ఆ గొడవెందుకు గాని నేను కూడా శ్రమ తెలియకుండా వుండటానికి నీకు ఒక కథ చెబుతాను. సమాధానం తెలిసి కూడా చెప్పక పోయావో నీ తల వేయి వక్కలవుతుంది తెలుసుగా..' భేతాళి అడిగింది.

'అబ్బో ఇది రోజుకు పది సార్లు వింటున్న మాటేగా.. ఇంక స్టోరీ బిగిన్జెయ్యి అన్నాడు' విక్రమార్కుడు.

వేణు శీను కాలేజీలో మంచి స్నేహితులు. అయితే ట్రాన్స్‌ఫర్ల వల్ల వేరే వేరే చోట్ల వుంటున్నారు. ఒకసారి వేణు పని మీద శీను వాళ్లింటికి వచ్చాడు.

భోజనాలయ్యాక మిత్రులిద్దరితో పాటు శీను భార్య సీత, పిల్లలు అంతా కూచుని కబుర్లు మొదలెట్టారు. సంభాషణ నెమ్మదిగా వేణు కుటుంబం వైపు మరలింది.

'మీరెప్పుడూ వదిన గారిని తీసుకురాలేదు' అంది సీత.

'ఎక్కడమ్మా ఎప్పుడూ ఏవో పనులు...' అన్నాడు వేణు.

అయినా మీరు వచ్చినప్పుడు తీసుకురావచ్చు గదా..

'ఇద్దరం వచ్చేస్తే ఇల్లు ఎలా నడుస్తుంది?'

'పోనీ మీరు వెళ్లి ఆంటీని పంపించండి అంకుల్' అంది శీను కూతురు.

'సరిపోయింది.. తను ఒక్కతే రాగలిగితే అంతకన్నానా? వాళ్ల పుట్టింట్లో కూడా నేను దించి రావలసిందే..' గొప్పగా చెప్పాడు శీను.

అప్పుడు సీత బిగ్గరగా నవ్వింది..

భేతాళి హఠాత్తుగా కథ ఆపేయడంతో ప్రశ్న సంధిస్తుందని సిద్ధమై పోయాడు విక్రమార్కుడు.

'రాజా. వేణు చెప్పిన దాంట్లో పెద్ద వింతేమీ లేదు కదా... సీత ఎందుకు అంతగా నవ్వింది? ఈ ప్రశ్నకు జవాబు తెలిసి కూడా చెప్పకపోయావో నీ తల వేయి వక్కలవుతుంది..' అని భేతాళి అనేలోగానో

'అదంతా చెప్పనవసరం లేదులే.. ఎంతో అభ్యుదయంగా మాట్లాడే వేణు తను లేకపోతే భార్య ప్రయాణాలు చేయలేదన్న భావాన్ని ఇతరులకు చెప్పడం చూసి ఆమెకు నవ్వొచ్చింది. చాలా మంది అలానే అంటుంటే వింటూ వుంటుంది గనక ఈయన కూడా ఇంతేనా అనుకుని వుంటుంది. ఒకవేళ ఆయన భార్య వంటరిగా వెళ్లలేనంటే ధైర్యం ఇచ్చి పంపించాలి గాని తను పెద్ద తోడు ఇస్తున్నట్టు ఫీలై పోవడాన్ని ఆమె ఎగతాళి చేసిందన్న మాట."

విక్రమార్కుడు ఉత్సాహంగా చెప్పుకుపోతుంటే భేతాళి శవంతో సహా చెట్టుపైకెక్కింది.

♦♦♦

మళ్లీ దాన్ని దించి భుజాన వేసుకుని బయలుదేరాడు విక్రమార్కుడు. షరా మామూలుగా భేతాళి కదిలింది.

'రాజా పురుషుడవైనప్పటికీ వున్న సంగతి వున్నట్టు చెప్పావు. సంతోషం. అందుకే నీకు మరో మంచి కథ చెబుతాను. వింటూ శ్రమ మర్చిపో' అంది.

'కానియ్' అన్నాడు విక్రమార్కుడు.

'రమేష్, కామేష్ దూరపు చుట్టాలు. పెద్దగా కలుసుకోరు. ఒక వ్యవహారం విషయమై కామేష్ ఇంటికి వచ్చాడు రమేష్. ఇద్దరూ కలసి వెళ్లి బ్యాంకులో డిపాజిట్టు కట్టి రావాలి. తీరా బయలుదేరే ముందు చూసుకుంటే ఒక కాగితం కనిపించలేదు. "అరే ఇంటిదగ్గర మర్చిపోయాను" అంటూ ఫోన్ చేశాడు రమేష్. "కాస్సేపట్లో వచ్చేస్తుందిలే మరేం పర్వాలేదు" అని చెప్పాడు. పదిహేను నిముషాల్లో రమేష్ కూతురు స్వప్న ఆ కాగితాలు తీసుకొని రావడంతో సమస్య పరిష్కారమైంది. వూపిరి పీల్చుకున్న కామేష్ ఆమెను పలకరించాలనుకున్నాడు.

'ఏమ్మా నీవొచ్చావ్? మీ తమ్ముడు లేడా?' అని అడిగాడు. ఆయన మాటకు జవాబు చెప్పకపోగా పగలబడి నవ్వింది స్వప్న.

'ఆహా?...' ఎగతాళిగా వూ కొట్టాడు విక్ర.

'అడిగిన దానికి జవాబు చెప్పే బదులు ఆ అమ్మాయి ఎందుకలా నవ్విందో..

చెప్పమంటావ్ అంతేగా?'

'తెలిసిందిగా చెప్పెయ్?' అంది భేతాళి

'బయటి పనులు ఏవైనా మగపిల్లలే చేయాలి తప్ప అమ్మాయిలు చేయలేరన్న రమేష్ ఆలోచనకు ఆమెకు నవ్వొచ్చింది. తన కంటే చిన్నవాడైన తమ్ముడు చేయగలిగిన పని తను చేయలేనను కోవడంచూసి అంతగా నవ్విందన్న మాట.. కరెక్టేనా?!' అని విక్రమార్కుడు అడిగేలోపునే భేతాళి

తుర్రున చెట్టుపై కురికింది.

'భేతాళుడి కన్నా భేతాళి స్పీడు ఎక్కువగా వుందే...' అనుకుంటూ విక్రమార్కుడు మళ్లీచెట్టుదారి పట్టాడు.

♦♦♦

ఆంజనేయులు, పరంధామయ్య ఒకే ఆఫీసులో పనిచేస్తారు. పరంధామయ్య ఈ మధ్యనే మరో వూరి నుంచి బదిలీ మీద వచ్చాడు గాని ఆంజనేయులు ఎప్పటి నుంచో అక్కడే వున్నాడు. ఫ్యామిలీని తీసుకురావాలంటే ఇల్లు కుదరక అవస్త పడుతున్న పరంధామయ్య అతనికి ఆ పని పురమాయించాడు. ఏదో ఇల్లు ఖాళీ వుందని తను ఇంటికి వెళ్లాక ఆంజనేయులు ఫోన్ రావడంతో ఉదయం రాగానే ఆ సంగతి తెలుసుకుందామని ఆశగా వచ్చాడు ఆంజనేయులు.

'నాకూ డీటైల్స్ తెలియదయ్యా.. ఇప్పుడే అడిగిచెబుతానుండు' అని సెల్లుతీసి నెంబర్లునొక్కాడు ఆంజనేయులు.

'ఆ, ఇల్లుందన్నారు కదా.. వివరాలు తెలుసుకున్నారా? ఏమిటీ; మీరే వెళ్లి చూసొచ్చారా? మీకు నచ్చితే ఇక తిరుగేముంటుంది? ఇలాటి విషయాల్లో మీరు కొట్టిన పిండి కదా.. సరే తనతో మాట్లాడి చెబుతానండీ..' అని ఫోను ఆఫ్ చేశాడు పరంధామయ్య.

'ఏమంటాడు ఓనర్ గారు?' ఆదుర్దాగా అడిగాడు ఆంజనేయులు.

'ఓనర్ గారేమిటయ్యా, మాట్లాడింది మా ఆవిడతోనైతే?' ఆశ్చర్యంగా అన్నాడు పరంధామయ్య..

'ఇప్పటి వరకూ మీరు మాట్లాడింది మీ భార్యతోనా?' అని నోరు తెరిచాడు ఆంజనేయులు. అతనికి జవాబు చెప్పకపోగా పొట్టచెక్కలయ్యేలా నవ్వడం మొదలెట్టాడు పరంధామయ్య.

ముచ్చటైన మూడో కథను మురిపెంగా వింటున్న విక్రమార్కుడికి బ్రేకు వేస్తూ -'రాజా! స్టోరీలో మునిగిపోయి నా సంగతే మర్చిపోయావే? మరి ఈ మూడోకథలో పరంధామయ్య ఎందుకు నవ్వాడు? తన భార్యకు తాను ఫోన్ చేస్తే ఆంజనేయులు అతనే ఓనరు అనుకున్నందుకా? మరెందుకు? రక్కున చెబితే నేను చెట్టెక్కేస్తా.' భేతాళి తొందర పెట్టింది.

'భేతాళీ! నీ తెలివి తేటలు నా దగ్గర చూపించొద్దు. నీ మాటలకు మోసపోతాననుకోవద్దు. పరంధామయ్య నవ్వింది అందుకు కాదు.తను ఫోన్‌లో అండీ అండీ అని మర్యాదగా మాట్లాడాను కాబట్టి అవతల వున్నది భార్య కాదని నిర్ధారణకు వచ్చిన మిత్రుణ్ణి చూస్తే అతనికి నవ్వొచ్చింది. భార్యలు భర్తలను బహువచనంతో మర్యాదగా మాట్లాడాలి గాని భర్తలు పొరబాటున కూడా అండీ అనడం అతను వూహించలేకపోయాడన్నమాట. సమస్య ఏమంటే భార్యా భర్తలు ఎవరైనా సమానమేనని అలాంటి వారికి అర్థం కాదు...'

రాజుకు మౌన భంగం కలగ్గానే భేతాళి చెట్టెక్కడానికి సిద్ధమైంది.

'రాజా స్త్రీ పురుషుల మధ్య తేడాలకు సంబంధించిన ఇలాంటి కథలు నా దగ్గర లెక్కలేనన్ని వున్నాయి. నీవు బతికినంత కాలం వాటికి సమాధానాలు చెప్పినా సరిపోవు. ఇంతకూ ఈ ఆఖరి ప్రశ్నకు జవాబు చెప్పేసి వెళ్లిపో..'

'ఈ రోజు నేను ఇవే కథలు ఎందుకు చెబుతున్నాను?'

'భేతాళీ! త్వరలో రానున్న మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భంగా ఇవన్నీ చెబుతున్నావని నాకు తెలియదనుకున్నావా?!' అని తిరిగి చూసే సరికి భేతాళి మాయమైపోయింది.

- పీపీ









బాల కథ

సాధు లక్షణం

ఊరి వెలుపల పెద్దమర్రిచెట్టు దగ్గరికి స్వామి వారొచ్చారు. కాషాయ వస్త్రాలు, పెరిగిన గడ్డం, మీసాలు చూసి మహిమ గల స్వాములవారని ఊరి జనమంతా భావించారు. తమకు తోచిన పండ్లు, పాలు తెచ్చి స్వామివారికి సమర్పించ సాగారు. అయినా ఆయన మాత్రం నోరు విప్పి మాట్లాడడు. కళ్లు తెరిచి చూడడు. నిరంతరం కళ్లు మూసుకుని ధ్యానం చేసుకుంటూ ఉండేవాడు. కష్టాలు చెప్పుకుందామని చాలా మంది ప్రయత్నం చేశారు. కానీ వారిని పట్టించుకోకుండా తన మానాన తను ధ్యానం చేసుకుంటూ ఉండేవాడు. మధ్యాహ్నం ఆకలి కాగానే ఎదురుగా వున్న పండో, పాలో తీసుకుని మళ్లీ కళ్లు మూసుకునేవాడు. రాత్రి కాగానే మళ్లీ ఎదురుగా వున్న వాటిల్లో ఏదోటి తిని చెట్టుకింద నిద్రపోయేవాడు. స్వామి అనుగ్రహిస్తాడేమోనని నెల రోజుల పాటు ఆత్రంగా ఎదురు చూశారు జనం. కానీ ఎవరితోనూ మాట్లాడి ఎరుగడు. ఊరి జనానికి విసుగొచ్చింది. ఇంక స్వామి దర్శించడం మానేశారు.



ఆరోజు ఊళ్లో సంబరం జరుపుకుంటున్నారు. గ్రామస్తులంతా కొత్త బట్టలు కట్టుకుని, పిండివంటలు చేసుకుని ఆనందంగా ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటున్నారు. కమ్మటి పదార్థాలతో ఊరంతా సువాసనలు కమ్ముకున్నాయి. కళ్లు మూసుకుని కూర్చున్న స్వామివారి ముక్కువద్దకు ఆ సువాసనలు చేరాయి. నోట్లో నీళ్లూరాయి. కడుపులో ఎలుకలు పరుగెత్తాయి. మధ్యాహ్నమైనా ఒక్కడూ ఆటువైపు రాలేదు. ఆకలి బాధకు తట్టుకోలేకపోయాడు. వెంటనే దండ కమండలాలు చేత పట్టుకుని ఊళ్లోకి వెళ్లాడు.

ఒక ఇంట్లో రైతు తన భార్యా బిడ్డలతో కలిసి గారెలు తింటూ ఆనందంగా గడపసాగాడు. మరో ఇంట్లో కొత్తగా పెళ్లయిన కూతురికి, అల్లుడికి చక్కటి భోజనం వడ్డిస్తూ మురిసిపోతోంది ఇల్లాలు. మరో ఇంట్లో నలుగురు స్నేహితులు విందు చేసుకుంటూ కనిపించారు. వారిని చూసి భగభగ మండిపోయాడు. ఊరి మధ్యనున్న రావి చెట్టు కిందకొచ్చి, అరుగుమీద నిలబడి "ఓ ధూర్త జనులారా... మీకెంత కండకావరం. ఈ సాధువు గురించి పట్టించుకోకుండా మీరిక్కడ పంచభక్ష్య పరమాన్నాలు తింటూ కేరింతలు కొడతారా? ఒక సాధువు చెట్టుకింద తపస్సు చేస్తున్నాడనే సంగతి మరిచి పోయారా? మిమ్మల్నీ, మీ ఊరిని శపిస్తాను. పంటలు పండక తిండి దొరక్క మలమల మాడి ఛస్తారు" అని ఆవేశం వెళ్లగక్కాడు.

పక్కనే రచ్చబండ మీద కూర్చున్న పెద్ద మనుషుల్లోంచి ఒక వృద్ధుడు లేచి "ఒక పూట ఆకలికి తట్టుకోలేని నువ్వేం సాధువ్వి? కోపాన్ని జయించలేని వాడికి సన్యాసం ఎందుకు? అలాంటి నీవు శపిస్తే మేం కష్టాలపాలవుతామా! నువ్వు ప్రజల కష్టాలు తీర్చినా, తీర్చకపోయినా, మాకు రావాలనిపిస్తే మీ వద్దకు వస్తాం. 'మీకు మేలు కలుగుతుంది' అని చెబితే జనమెంత సంతోషపడేవారు. నీకు బ్రహ్మరథం పట్టకపోదురా? మేం ఎంత మొర పెట్టుకున్నా, నోరు మెదపవైతివి. ఇప్పుడు ఆకలికి నోరెలా పెగిలింది?" అన్నాడు.

స్వామి సిగ్గు పడ్డాడు. తనలోనే లోపముందని తెలుసుకున్నాడు. వెంటనే తనను మన్నించమని పెద్దలని, ఊరి జనాన్ని వేడుకున్నాడు. "మౌనంగా వుంటేనే గొప్పవాడని ఇంతకాలం అనుకున్నాను. కానీ కాస్త క్రాంతిని, ఇంకాస్త శాంతిని కలుగజేసే మాటలు గొప్పవని ఇప్పుడే తెలుసుకున్నాను" అన్నాడు పశ్చాత్తాపంతో చేతులు జోడిస్తూ.

ఊరిజనమంతా అతని పట్ల యథా ప్రకారం ఆసక్తి కనబరిచారు. వారి కష్టాలు వింటూ తనకు తోచిన సలహాలనిస్తూ, ధైర్య వచనాలు చెబుతూ చాలా కాలం ఆ ఊరిలోనే ఉండిపోయాడు.

- పుప్పాల కృష్ణమూర్తి



దారి చెప్పేస్తే పోలా...

హాయ్... ఈ బుజ్జి పిగ్గీని చూశారా. ఎంచక్కా ఓ బుల్లి బుట్ట తీసుకుని మార్కెట్‌కి బయలుదేరింది. అయితే ఈ తికమక దారిగుండా వెళ్లలేక అలాగే నిలబడి పోయింది. మీరు సాయం చేసి దారి చెప్తే చక్కగా మార్కెట్‌కి వెళ్లి తనకి కావలసినవి కొనుక్కుంటుందట. మరి చెప్పేస్తారుగా.

బి.ప్రవీణ్
లార్డ్ వెంకటేశ్వరా హైస్కూల్,
9వ తరగతి, కర్నూల్.

కనిపెడదామా...!

హాలో బుజ్జాయిలూ... బాక్సులో కొన్ని ఆంగ్ల అక్షరాలు వున్నాయి చూశారుగా. వాటి కిందే కొన్ని పదాలు కూడా ఉన్నాయి. ఆ పదాలు పైనున్న అక్షరాల్లో నిలువుగా, అడ్డంగా, వంకరగా ఎక్కడైనా వుండొచ్చు. వాటిని వెతికి ఇక్కడ చూపించినట్లుగా సున్నా చుట్టండే!

O	E	O	E	B	O	B	O	O	L	C	H
H	N	I	L	T	R	O	B	H	T	A	S
B	C	O	D	Y	A	G	H	O	S	T	G
D	O	T	M	D	N	R	B	A	T	S	N
D	H	M	A	C	G	E	O	F	U	T	A
P	U	O	A	P	E	D	E	F	T	M	E
M	U	N	U	T	R	I	C	K	O	P	M
M	D	M	K	S	E	P	H	O	E	A	A
Y	D	C	P	H	E	S	R	C	L	R	S
W	E	I	E	K	R	B	R	D	P	T	K
N	Y	N	E	O	I	O	O	E	P	Y	E
C	T	F	H	O	W	N	L	U	A	A	S

GHOST SPIDER CANDY CROW BLOOD
PATCH HOUSE ORANGE BATS MASK
APPLE TRICK PUMPKIN NECK PARTY
BROOM FANGS MUMMY



జవాబు: బస్సు=8, పుస్తకం=3, జెండా=5, సూర్యుడు=4, ఉత్తరం=9, మొత్తం =29.

మొత్తం ఎంత?

చిన్నారులూ... పైన బస్సు, పుస్తకం, జెండా, సూర్యుడు, ఉత్తరం బొమ్మలున్నాయి కదా. వాటిలో ఒక్కో దానికి ఒక్కో విలువ ఉంది. వాటిని కూడితే పైన చూపించినట్లు ఆ సంఖ్యలు వచ్చాయి. మీరేం చేయాలంటే వాటిలో ఒక్కో దాని విలువ ఎంతో కనిపెట్టి చెప్పాలి. అంతేకాదు! చివరి వరుసలోని మొత్తం కూడా లెక్కకట్టి వేయాలి. మరి త్వరగా లెక్క చేసేస్తారు కదూ.

మాటల కోట - 39

రూపకల్పన : కర్లపాలెం

1	2	3	■	4		5		6
■	7			■	■		■	
8			■	■	9		10	■
	■	11		■		■		12
13			■	14	■	15		
16		■	17	■	18		■	
■	19	20		■	21			
23	■		■	■	24			■
25					■	26		

అడ్డం :

1. క్రైస్తవుల క్రాసు (3)
4. కాలా ఛత్తర్ (5)
7. ఎఱ్రనామాత్యుని ఆదరించిన ఈ రెడ్డి రాజు రాజ్య రాజధాని. అటునుండి (3)
8. రమ్మంటే (3)
9. చిట్టి---! చిన్ని నాన్నలు! మన ఇద్దరికే తెలుసు ఈ మమతలు!(3)
11. ఆడపిల్ల దీనితో తిరగేసి కొట్టినా ఆనందమే! (2)
12. 'అరక'లో తొలి అక్షరం పొలమెళ్లింది (2)
13. ఇతని గుడారాన్నే ఒంటె ఆక్రమించింది ఒక కథలో (3)
14. మేస్త్రీలో సగం ఆడమనిషే! (1)
15. టీకకు వివరమైన టీకా... దీనిని టిప్పనము అని కూడా అంటారు (3)
16. పశ్చిమ బెంగాల్ రాజధానిలో 'కల'కనవద్దు!(2)
18. నండూరి పార్థసారథి పొట్టిపేరు (2)
19. అటునుండైనా సరే ఉద్యోగులు సరిగ్గా ఒకటో తారీఖునే రావాలని కోరుకునేవి (3)
21. ఆలోచనలే. వీటికీ 'తల' వుంటుంది (4)
24. వాడలేని భీమకవి ఇంటిపేరు (3)
25. హిమజ్వాల రచయిత దాసు లేకుండా (5)
26. గణేష్ పాత్రో ప్రసిద్ధ చిల్లర నాటిక (3)

నిలువు :

1. చెదిరిన తుప్పు (3)
2. ఎన్టీఆర్ ధనం వద్దన్న చిత్రం (5)
5. సుబ్బీ మొగలి పూవంటి మొగుడును ఈయవే! (3)
6. తెలుగు మేలు (2)
8. మరీ ఇంత 'అరాచకమా! అక్షరాలు నాలుగు చెదిరిపోయాయి! (4)
9. పంచభూతాలలోని రుణం (2)
10. రాళ్లు ఖ్లురా అయినప్పుడు 'రప్పలు' ఇలా అవవా? (3)
12. నిప్పురవ్వలు. నిప్పు ముట్టుకోకండి. కాలుతుంది! (4)
15. పి.వి గారి ఇంటికా.. అటునుండి రావాలి! (5)
17. అమ్మగారూ! పదవిపోయిన తర్వాత (2)
18. ఇటునుండైనా సరే ఉద్యోగులు సరిగ్గా ఒకటో తారీకునే రావాలని కోరుకునేది (3)
20. దురదపువ్వు (3)
21 తిరగబెట్టి పులవబెడితే ప్రేమ పుడుతుంది (3)
23. పల్చటి సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ (2)

మాటలకోట - 38జవాబు

1 స	మ్మె	■	2 జా	గో	3 రె	■	4 త	5 ల
డి	■	6 పా	గా	■	7 గో	రు	■	త
■	8 వా	■	9 రం	10 గా	బం	■	11 కా	■
12 పో	లీ	13 సు	■	లి	■	14 వా	కి	15 లి
కి	■	16 మ	■	■	17 మా	ట	■	గ
18 రి	19 మ్మి	తి	■	20 ప	■	21 రు	22 దూ	పాం
■	అ	■	23 మి	సి	24 మి	■	త	■
25 పా	■	26 అ	ద్దె	■	27 ణు	వే	■	28 రా
29 ట	పా	■	30 లు	కు	కు	■	31 మా	వి

ప్రేమమయం

చెట్టూ పుట్టా
మృగమూ మనిషీ
ప్రాణి సమస్తం
పణయ నర్తనం

ఈ అనాది భావపు అభినవ రూపం. మనం చూసే ప్రేమ దినోత్సవ ప్రణయార్భాటం. ప్రాణి సహజమైన ప్రేమకు ఒక రోజేమిటి అంటే అది ఆధునిక వినిమయ ప్రపంచానికి మాత్రమే తెలిసిన సమాధానం. ఆ రోజు వచ్చిందంటే చాలు, ఎక్కడెక్కడ లేని చిత్ర విచిత్ర మార్గాల్లో ప్రేమావిష్కరణం చేసి పరవశించమంటారు. కాకపోతే అందుకు కాస్త ఖర్చవుతుంది. ఈ ప్రేమ జపం వ్యాపార మయం కూడా అనుకున్నప్పుడే ఒకింత చివుక్కుమంటుంది మనస్సు. అయినా తప్పేదేముంది.. అందరూ ఎగబడేలా చేసే మార్కెట్ మరులు మనోహరులు..

అందమైన చేతివ్రాత - ఉచిత శిక్షణ

Send SMS... "HRC" space "Your address" to 55352

India's No.1 Handwriting Expert, Graphologist, Graphotherapist, NLP Trainer, Handwriting Research Centre (HRC) అధినేత చదువుల డాక్టర్‌గా బిరుదాంకితులైన Sri. Bhasckarr Raaju గారి "గుడ్ హ్యాండ్రైటింగ్" ప్రత్యక్ష శిక్షణలో నిష్ణాతులైన 150 మంది శిక్షకులు రాష్ట్ర నలుమూలల వారి వారి ప్రాంతాలలో అందమైన చేతి వ్రాతను బోధిస్తున్నారు!!

HANDWRITING HOMESTUDY KIT ను సొంతం చేసుకొన్న వారికి అందమైన చేతివ్రాతపై ఉచిత శిక్షణ!!



FREE

మీ స్పెల్లింగ్ సమస్యకు పరిష్కారం ... మీ సెల్ ఫోన్‌లో ఉచితంగా...!!

SPELLING సమస్యా...?!

పరిష్కారం కొరకు...

Send SMS... HRC space SPELL to 55352

Specially designed to... 3rd to 10th Class

ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ...
అందమైన చేతివ్రాతను సొంతం చేసుకోవడానికి
రూపొందించబడిన Hai-Pad, Hai-Slate లను సొంతం చేసుకోండి!
అందమైన చేతివ్రాత మీ సొంతం అవుతుంది!!
వివరములకు దిగువ కనబరచిన మీ సమీప డిస్ట్రిబ్యూటర్స్‌ను సంప్రదించండి!!



Chittoor : Bhasckarr Raaju Enterprises, ✆ : 9966555536, Nellore : Nazeem Enterprises, ✆ : 9440928532, Guntur : Sree Vigneshwara Enterprises, ✆ : 9440022999, Krishna : Bee Hive Enterprises, ✆ : 9866869649, East Godawari : Excellence Enterpises, ✆ : 9440776596, Vizag : K Enterprises, ✆ : 9396409988, Warangal : Sai Agencies, ✆ : 9347551328, Ananthapur : Akshara Distributors, ✆ : 9966987577.

మిగిలిన జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ కొరకు వెంటనే సంప్రదించండి!!

For any information feel free to contact...

e HRC

Bhasckarr Raaju ... Good Handwriting for All

HANDWRITING RESEARCH CENTRE

1-5-565 Balaji Colony, TIRUPATI.

Cell : 9000072359, 9246997139